# వార్త

ఆదివారం

30 జులై, 2023

# మనిషి మెదడులో మేధో బాంబు



తారాతీరం



# బాలీవుడ్‌లోకి కీర్తి సురేష్!

దక్షిణాది సినిమా దగ్గర తన విలక్షణ నటనతో ఎంతగానో ఆకట్టుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ కథానాయిక కీర్తి సురేష్. తెలుగు, తమిళ భాషల్లో ఎన్నో చిత్రాలు చేసి భారీ స్టార్‌డమ్, మార్కెట్‌ని తెచ్చుకున్న ఈ యువ నటి ఇప్పుడు తన మొట్టమొదటి బాలీవుడ్ చిత్రానికి సైన్ చేసినట్టు తెలుస్తోంది. బాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ ధావన్‌తో కీర్తి సురేష్ కోలీవుడ్ భారీ హిట్ చిత్రం 'తేరి' రీమేక్‌లో నటించనున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఒరిజినల్‌గా దళపతి విజయ్‌తో దర్శకుడు అట్లీ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ చిత్రాన్ని హిందీలో అట్లీ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు ఎవరనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది.

# ద్విపాత్రల్లో బెల్లంకొండ శ్రీనివాస్

ఈ మధ్యకాలంలో కథానాయకులు తమలోని యాక్షన్ హీరోను స్టైలిష్‌గా ఆవిష్కరించడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. అడివి శేష్ నుంచి 'గూఢచారి' వచ్చిన దగ్గర నుంచి మళ్లీ ఈ జోనర్ దారిలో ట్రాఫిక్ పెరిగింది. ఇప్పుడు 'డెవిల్'గా రావడానికి కళ్యాణ్‌రామ్ సిద్ధమవుతున్నాడు. ఇదే జోనర్లో ఇప్పుడు ఒక సినిమా చేయడానికి బెల్లంకొండ శ్రీనివాస్ రెడీ అవుతున్నాడు. ఈ సినిమాకు దర్శకుడు విశ్వ. 'పరంపర' వెబ్ సిరీస్‌తో విశ్వ మంచి పేరు తెచ్చుకున్నాడు. ఆయన వినిపించిన ఒక కథకి బెల్లంకొండ వెంటనే ఓకే చెప్పినట్లు సమాచారం. ఈ సినిమాలో ఆయన మరో పాత్రలో కూడా కనిపించనున్నాడు. ద్విపాత్రాభినయం ఉండటం వల్లనే ఈ సినిమా చేయడానికి అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ సినిమా తెలుగుతో పాటు హిందీలోను విడుదల కానుంది.



ఆదివారం వార్త

30 జులై, 2023

## మంచి ముత్యాలు

మగువ, మధువు తరుచుగా రాజ్యపతనానికి కారకులయ్యాయి. అయితే, పుస్తకాల మూలంగా చెడిపోయిన వారినెవరినైనా చూచారా?

- చైనా కథ నుండి

## విషయ విశేషం


మరింత సౌకర్యం.... 4

'సంఘీ'భావం....5

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

కవర్ స్టోరీ..6

మనిషి మెదడులో మేధో బాంబు

సిమెంట్ లేకుండా ఇల్లు..11

ఈవారం కవిత్వం..12

చిన్ననాటి స్మృతులు

ఓ రైతు ఆదర్శం...14

దేవుడెవరు..దూతెవరు?...23

కథ.. 20

అందమైన అనుభూతి

సాహిత్యం..24

కాళ్ళకూరి-నాటకత్రయం

విమాన వేగాన్ని తలపిస్తున్న బుల్లెట్ రైళ్లు...26

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### మామిడి చేప



మామిడి పండును నీళ్లలో వేస్తే మునిగిపోతుంది. కానీ నీళ్లలో ఈదుకుంటూ వెళ్లడం ఎప్పుడైనా చూశారా..పోనీ విన్నారా! లేదు కదా..అయినా మామిడి పండుకి ఏమన్నా ప్రాణముంటుందా ఈదడానికి అనే కదా సందేహం. ఈ ఫొటోలోని పండు మాత్రం నీళ్లలోనే పుట్టి పెరుగుతుంది. నీళ్లతోనే బతికేస్తుంది. అచ్చంగా మామిడి పండును పోలిన ఈ జీవి మరేదో కాదు చేప. రోత్రాలిన్ మోలియాగ్రిస్ అనీ, గినియా ఫౌల్ పఫర్ అనీ పిలుస్తారు. నీళ్లని మింగడం వల్ల దాని శరీరం బొద్దుగా ఉంటుంది. పట్టుకోగానే మెత్తగా ఉండే ఈ చేపల్లో కొన్ని చర్మంపైన ఎలాంటి మచ్చలూ లేకుండా బాగా పండిన బంగినపల్లి మామిడి పండులా కనిపిస్తాయి. చిన్న నోరూ, కళ్లూ, చెవులూ ఉండీ లేనట్టున్న తోకతో ఈ చేప భలే ముద్దుగా ఉంటుంది. ఈ జాతిలో కొన్ని విషపూరితమైనవీ ఉంటాయట. అందుకే వీటిని పెంచడానికి తప్ప తినడానికి వాడరట. ఇవి ఎక్కువగా తూర్పు పసిఫిక్ దేశాలైన చైనా, థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా, జపాన్, ఫిజీ వంటి దేశాల్లోనే కనిపిస్తాయి.

### వార్త లేఖ

16వ తేదీ ఆదివారం సంచికలో ప్రచురించిన కవర్‌స్టోరీ 'ఆరోగ్య ధామాలు ఆసుపత్రులే' వ్యాసం బాగుంది. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించిన తీరుబాగుంది. ఈవారం బాలగేయం, కథ బాగున్నాయి. జర్మనీలో ఉన్నత విద్యలో కొత్త విషయాలను తెలిపారు. ప్రాణమిత్రుడి కథ ముగింపు చాలాబాగుంది. పాఠకులకు ఉపయోగకరమైన అంశాలను అందించారు.

- పక్కిరాధాగోపాలకృష్ణ,
పాపయ్యరాజుపాలెం, విశాఖపట్నం-51

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# వాటర్ టాక్సీ
# మరింత సౌకర్యం

ఇది పడవేగాని, అడుగు భాగాన్ని నీటిపై మోపకుండా ప్రయాణిస్తుంది. దీనిలోని ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్ వల్ల ఇది నీటి ఉపరితలానికి దాదాపు ఒక అడుగు ఎత్తున ప్రయాణిస్తుంది. దీని లోపలిభాగం ఒక వ్యాను లోపలి భాగం మాదిరిగానే ఉంటుంది. అందువల్ల దీనిని వాటర్ టాక్సీగా వ్యవహరిస్తున్నారు. బ్రిటన్‌కు చెందిన ఆర్టెమిస్ టెక్నాలజీస్ సంస్థ ఈ విచిత్ర వాహనాన్ని 'ఈఎఫ్'12 ఎస్కేప్' పేరుతో ఇటీవల మార్కెట్‌లోకి విడుదల సింది.

ఇందులో ఇద్దరు సిబ్బంది కాకుండా, మరో పన్నెండుమంది ప్రయాణించవచ్చు. దీని గరిష్ఠవేగం గంటకు 52 నాటికల్ మైళ్ల (96.3 కి.మీ) ఇది పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనం కావడం వల్ల పూర్తిగా పర్యావరణ అనుకూలమైనదని, ప్రయాణికుల జలరవాణాలో ఇది విప్లవాత్మకమైన మార్పులు తీసుకురాగలదని ఆర్టెమిస్ ప్రతినిధులు చెబుతున్నారు.

---

**'కొవిడ్'** మహమ్మారి దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా

# వైరస్‌ను ఇట్టే కనిపెట్టేస్తుంది




వైరస్ పేరు చెబితేనే జనాలకు వెన్నులో వణుకు మొదలయ్యే పరిస్థితి దాపురించింది. వైరస్‌ల నిర్మూలన కోసం శాస్త్రవేత్తలు తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం కూడా చేశారు. 'కొవిడ్' తర్వాత వైరస్‌ల ఆచూకీని కనిపెట్టే సాంకేతికత కూడా అభివృద్ధి చెందింది. తాజాగా వైరస్‌ల జాడ గుర్తించగలిగే 'విక్లోన్' అనే ఈ స్మార్ట్‌వాచ్ అందుబాటులోకి వచ్చింది. టైమ్ చూపించడం సహా మిగిలిన పనులన్నీ ఇది ఇతర స్మార్ట్‌వాచీల మాదిరిగానే చేయడమే కాకుండా, చుట్టుపక్కల గాలిలో వైరస్‌లు ఉంటే, వెంటనే అప్రమత్తం చేస్తుంది. గాలిలోని సూక్ష్మకణాలను ఇది లోపలికి పీల్చుకుంటుంది. ఇందులో అమర్చిన అధునాతన సాంకేతికత ద్వారా ప్రమాదకరమైన బ్యాక్టీరియా కణాలు వాటిని వెంటనే గుర్తించి అప్రమత్తం చేస్తుంది.

# పోర్టబుల్ పవర్‌స్టేషన్

చూడటానికి ఇది ట్రాలీ సూట్‌కేసులా కనిపిస్తుంది. గాని, నిజానికిది పోర్టబుల్ పవర్‌స్టేషన్. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు ఇంట్లో వాడుకోవడానికే కాకుండా, బయటకు తీసుకుపోవడానికి కూడా ఇది అనువుగా ఉంటుంది. అమెరికన్ కంపెనీ 'గోల్ జీరో' ఇటీవల సూట్‌కేసు పరిమాణంలోని పోర్టబుల్ పవర్‌స్టేషన్‌ను 'యతి 6000 ఎక్స్' పేరుతో మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీనిని మూడురకాలుగా చార్జ్ చేసుకోవచ్చు. దీనికి సౌరఫలకాలను ఏర్పాటు చేసినందున నేరుగా సూర్యరశ్మి ద్వారా దీనిని చార్జ్ చేసుకోవచ్చు. ఇంట్లో ఉన్నప్పుడు ఇతర పరికరాలకు మాదిరిగానే గోడకు అమర్చిన ప్లగ్‌బోర్డు ద్వారా చార్జ్ చేసుకోవచ్చు. కారులో ప్రయాణించే సమయంలో కారులోని అడాప్టర్ ద్వారా కూడా చార్జ్ చేసుకోవచ్చు. ఇది 6000 వాట్ల విద్యుత్తును నిల్వ చేసుకోగలదు. దీన్ని ఆన్ చేసుకుంటే, 2000 వాట్ల విద్యుత్తును సరఫరా అయ్యే విద్యుత్తుతో ఎలాంటి ఎలక్ట్రిక్ వస్తువులనైనా వాడుకోవచ్చు. 'యతి-2.0' యాప్ ద్వారా దీని చార్జింగ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు స్మార్ట్‌ఫోన్‌లో చూసుకోవచ్చు.



# 'సంఘీ' భావం



## సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

ఈసారి రుతుపవనాల రాక చాలా ఆలస్యం అయ్యింది. ప్రతి సంవత్సరం కంటే ఈసారి నెల రోజులకు పైగా వ్యత్యాసం తరువాత వర్షాలు కురిసాయి. ఎండలతో సతమతం అవుతున్న ప్రజలకు, విత్తులు నాటి ఎదురుచూపులు చూస్తున్న అన్నదాతలకు ఈ వర్షాలు ఎంతో ఊరటనిచ్చాయి. వర్షాలు కురిస్తే అందరికీ ఆనందమే కాని కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. మిగిలిన సీజన్లతో పోలిస్తే వర్షాకాలం తనతో పాటు అంటువ్యాధులను, రోగాలను వెంట తీసుకువస్తుంది. ఈ సీజన్‌లో వైరల్ జ్వరాలు ప్రబలుతాయి. వీటితో పాటు కొన్ని ప్రాణాంతకమైన వ్యాధులు కూడా వ్యాప్తి చెందుతాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వీటి బారిన పడి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ సీజన్‌లో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మలేరియా, టైఫాయిడ్, కలరా, చికున్‌గున్యా, జలుబు, స్వైన్ ఫ్లూ, ఫ్లూ, దగ్గు, తలనొప్పితో పాటు సాధారణ జ్వరాలు వస్తుంటాయి. వర్షాకాలం ప్రారంభమై రెండు రోజులు చినుకులు పడితే చాలు దోమల ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. ఎక్కువ జ్వరాలను, రోగాలను అంటించే వాటిలో దోమలు ముందువరుసలో ఉంటాయి. మలేరియా అనాఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాప్తి స్తుంది. కుట్టిన దోమలో ప్లాస్మోడియం పరాన్నజీవి ఉంటే మలేరియా మన శరీరంలోకి చేరి వ్యాప్తి చెందుతుంది. అధిక తేమ, ఉష్ణోగ్రతలో ఒక్కసారిగా కలిగే మార్పులు వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణంగా నిలుస్తుంది. న్యూమేనియా, ఉబ్బసం, డయాబెటిక్, గుండె సమస్యలు వంటివి ఉన్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. మురికి కాల్వలలో పేరుకున్న చెత్త, నిల్వనీరు, దోమలకు నిలయంగా ఉంటాయి. దోమల వ్యాప్తి చాలా వేగంగా జరుగుతుంది. ఇంటికి సమీపంలో నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమలు వ్యాప్తి చెందే ప్రదేశాల్లో మున్సిపల్ అధికారులతో మాట్లాడి మందును చల్లే ఏర్పాటుచేయాలి. ఇంట్లో దోమలు చేరకుండా కిటికీ, గుమ్మం తలుపులు సాధ్యమైనంతవరకు మూసివేసి ఉండేలా ప్రయత్నిం చాలి. దోమలు ఇంట్లోకి చేరకుండా మస్కిటో కాయిల్స్, ఆయిల్ వంటివి ఉపయోగించాలి. వంటగదిలోని సింక్‌లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఇంట్లోగాని, వాకిట్లో గాని మొక్కలు పెంచుతున్నట్లు అయితే వాటికి వేసే నీరు నిల్వ ఉండే విధంగా లేకుండా చూసుకోవాలి. ఇంట్లో కొబ్బరికాయల టెంకలు ఒకమూల పడేస్తూ ఉంటారు. వాటిలో వర్షం నీరు చేరి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారుతుంది. అదేవిధంగా మురుగు నీరు నిల్వ ఉండకుండా పారే విధంగా చర్యలు తీసుకోవాలి. నగర, పట్టణ శివార్లలో డ్రైనేజ్ వ్యవస్థ లేని కాలనీల్లో ఇంటి బయట గుంతలు తవ్వి అందులోకి మురుగు నీరు చేరే విధంగా ఏర్పాట్లు చేసుకుంటారు. ఇలాంటి గుంతల్లో మురికి నీరు దోమలను ఉత్పత్తికి కారణం అవుతుంది. ఈ గుంతల్లో ఫెనాయిల్ వంటి క్రిమిసంహారక మందులను వేయాలి. కొన్ని కాలనీల్లో ఇళ్ల నిర్మించకుండా ఖాళీ ప్రదేశాలు ఉంటాయి. ఇలాంటివి ఇంటి పక్కనే ఉంటే కూడా దోమల బెడద అధికంగా ఉంటుంది. ఈ ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. పిచ్చి మొక్కలు పెరిగితే ఆయా స్థలాల యజమానులకు సమాచారం ఇచ్చి వాటిని తొలగించే ఏర్పాట్లు చేసుకోవాలి. దోమల లార్వా పెరగకుండా మలాథియాన్ స్ప్రేను చేసుకోవాలి. చిన్నపిల్లలకు కాని, పెద్దవారికి గాని జలుబు, జ్వరం వస్తే వెంటనే ప్యారాసిటమాల్ మందులు వేయాలి. ఒకటి, రెండు రోజుల్లో జర్వం తగ్గక పోతే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వైద్యులు రక్త నమూనా పరీక్షలు చేయడం ద్వారా జ్వరం ఏ కారణంగా వస్తోందో గుర్తించి తగిన మందులు వేస్తారు. వర్షాకాలంలో వచ్చే జ్వరాల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వైరల్ శరీరంలో పెరుగుతూ వచ్చి ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది. మలేరియా వంటి వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే సెరిబ్రల్ మలేరియాకు దారితీస్తుంది. ఇది ప్రాణాంతమైన స్థితిలోకి తీసుకువెళతుంది. మూత్రపిండాలు దెబ్బతినడం, కామెర్లు, శ్వాసకోశ రుగ్మతలకు దారితీస్తుంది. మలేరియా సోకినప్పుడు జ్వరం, జలుబు, దగ్గు, శరీరం నొప్పులు, తుమ్ములు, ముక్కుకారడం, విరేచనాలు, ఊపిరి సరిగ్గా ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంచే పండ్లు, పాలు, గుడ్లు వంటివి తరచూ తీసుకోవాలి. తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటిని గోరువెచ్చగా తీసుకోవాలి. చాలా సందర్భాల్లో ముందురోజు వండి మిగిలిన ఆహార పదార్థాలను ఫ్రిడ్జిలలో పెట్టి మరుసటి రోజు తింటూ ఉంటారు. ఇలాంటి ఆహార పదార్థాలు సేవించడం వల్ల కూడా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. తప్పనిసరి అయితే ఫ్రిడ్జిలో నుంచి తీసిన తరువాత కనీసం గంట వరకు సాధారణ ఉష్ణోగ్రతలో ఉంచి ఆ తరువాత గరిష్టస్థాయిలో వేడి చేసిన తరువాత భుజించాలి. ఇలా చేయడం వల్ల హానీ కలిగించే సూక్ష్మజీవులు ఉంటే వాటిని నిర్మూలించే అవకాశం కలుగుతుంది. ఎట్టిపరిస్థితుల్లో ఫ్రిడ్జిలలో పెట్టిన నీటిని గాని, శీతలపానీయాలను గాని తీసుకోకూడదు. తగిన జాగ్రత్తలు తీసుకుని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

ఆసక్తి, పట్టుదల, విజ్ఞానతృష్ణ మానవ జీవితాన్ని ఊహాతీతమైన మలుపు తిప్పగలదు. ఏదో సాధించాలనే తపనతో, నిద్రాహారాలు వదిలేసి, నిరంతర శ్రమతో, నిస్వార్థమైన ఆలోచనలతో, పరిశోధనలతో మానవ ప్రపంచాన్ని వినూత్నంగా ఆవిష్కరించే ప్రయత్నంలో సర్వ సుఖాలు త్యజించి, జ్ఞానమే సంపదగా, మానవ శ్రేయస్సే సర్వస్వంగా భావించి, వయసంతా కరిగి పోయి, శరీరమంతా ముడతలు పడి వార్థక్యపు అంచులపై నిలబడి చూస్తే ముసలితనం ఆవహించిందని, మరణం దగ్గర పడిందని తెలుసుకునేసరికి జీవితం తమ చేతుల్లో లేదని అవగతమౌతుంది.



# మనిషి మెదడులో మేధో బాంబు

కవర్ స్టోరీ

**సుంకవల్లి సత్తిరాజు**


ఇవీ శాస్త్రవేత్తల జీవితాల్లో జరిగే సహజ సంఘటనలు. జ్ఞాపకాల పుస్తకాన్ని తెరచి చూస్తే తాము ఈ ప్రపంచానికి ఏమి అందించామో, ఎలాంటి ఆవిష్కరణలతో జనజీవితాలను ఎలా ప్రభావితం చేసామో ఆవలోకనం చేసుకుని, ప్రపంచం దృష్టిలో తమకున్న విశిష్టమైన స్థానాన్ని, గౌరవాన్ని తలచుకుని జీవితానికి ఇంతకంటే తృప్తి, పరమార్థం మరొకటి లేదని భావించి, మానసికానందంతో, ఉద్వేగంతో అంతిమ క్షణాలను ఆనందంగా గడిపిన శాస్త్రవేత్తల జీవితాలు చరిత్ర గర్భంలో కలిసిపోయినా, వారి పరిశోధనల, ఆవిష్కరణల ఫలితాలను అనుభవిస్తున్న ప్రపంచం వారి సేవలను మరవదు.

ఈరోజు ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంలో ఇంత ప్రగతి సాధించినా ఇంకా ఏదో సాధించాలనే తపన మాత్రం సజీవంగా ఉండడానికి నాటి శాస్త్రవేత్తలు నాటిన బీజాలే కారణం. వారి ఆలోచనలే జ్ఞానమై, వారి పరిశోధనలే ఆవిష్కరణలై నేటి ప్రపంచాన్ని మనం ఊహించని విధంగా మార్చిన సంగతి మరవలేం. నిత్య హోమంలా సాగిన విజ్ఞాన మథనం ఎన్నో మలుపులు తిరిగి, ఎన్నో సంఘర్షణలకు గురై, ఎన్నో సంక్షోభాలను చవిచూసి చివరికి 'కృత్రిమ మేధ' అనే వినూత్నమైన సాంకేతిక ప్రక్రియకు దోహదం చేసిం ది. కృత్రిమ మేధ గురించి వివరించే ముందుగా మానవ మేధస్సు కు సంబంధించిన విషయాలను, మానవ మేధస్సు ఎలాంటి ఆలోచనలకు, పరిణామాలకు గురౌతున్నదో, భవిష్య మానవ జీవితాల్లో 'కృత్రిమ మేధ' ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుందో తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం. ప్రపంచంలోని ఏడు వింతల గురించి మనం చాలా గొప్పగా చెప్పుకుంటాం. వీటి గురించి ఆసక్తిగా వింటాం. 'కొత్తక వింత పాతొక రోత'గా పాత విషయాలను పక్కన బెట్టి, కొత్త వింతల కోసం అన్వేషిస్తాం, ఆనందపడతాం. వర్తమానంలో నిత్యం మన కళ్ల ముందు ఎన్నో వింతలు కనబడుతు న్నాయి. కలలో కూడా ఊహించని ఆశ్చర్యకరమైన సంఘటనలు ఇలలో జరుగుతున్నాయి. ఆకాశమే హద్దుగా అంతులేని వింత కథలకు ప్రాణమొచ్చి, మన ముందు సాక్షాత్కరిస్తున్న భావన కలుగుతున్నది. మన భ్రమలు, ఊహలు నిజమైన మన ముందే వాస్తవమై కదలాడుతున్నాయి. చిత్రాలు విచిత్రాలుగా రూపు దిద్దుకుని జీవం పోసుకొని, మన ఎదుటే నిలబడుతున్నాయి. కలయా? నిజమా? అనే భ్రాంతిని కలిగిస్తున్నాయి. చూపులను కట్టిపడేస్తున్నాయి. మనం ఊహించుకునే కల్పనలు, కల్పిత గాథలు వాస్తవమై సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నాయి. ఏదో మాయ మన కళ్లకు కనికట్టు చేసి, క్షణ కాలం విభ్రమకు గురి చేసి, ఇంద్రజాల విద్య ల మాదిరిగా మనల్ని భ్రమలో ముంచి, రసవత్తరంగా రక్తి కట్టించే కృత్రిమ సన్నివేశాల సమాహారాలతో ఉర్రూతలూగించి, ఈ ప్రపంచాన్ని తెలియని వింతలోకపు శిఖరాలకు తోడ్కొని పోతున్నాయి. సృష్టిలో ఇన్ని అద్భుతమైన కళలున్నాయా? ఇంతటి ప్రతిభా సామర్థ్యాలు మానవుడి మస్తిష్కంలో నిక్షిప్తమై ఉన్నాయా? మానవ మేధస్సు ఇంతగా వికసించి, విస్తృతమై మానవ ప్రపంచాన్ని శాసిస్తుందా? అనే సంశయం కలగడం సహజం. నేటి ప్రపంచంలో చోటు

చేసుకుంటున్న అద్భుతాలను కొన్ని దశాబ్దాల కిందట ఎవరూ ఊహించి ఉండరు. పోతులూరి వీరబ్రహ్మం గారి కాలజ్ఞానం గురించి మనమందరం ఎంతో కొంత చదివే ఉంటాం. మన పెద్దలు చెబితే వినే ఉంటాం. ఈ భూ ప్రపంచంలో అప్పటికి లేనివాటికి, భవిష్యత్తు ఇలా ఉండవచ్చని ఊహించిన వాటికి వాస్తవ రూపమిచ్చి ఒక అద్భుతమైన నూతన ప్రపంచ సృష్టికి నాంది పలుకుతున్న నేటి మానవ విజ్ఞానానికి సాగిలపడి, సాష్టాంగ ప్రణామాలు తెలియచేయాలో, మన కల్పితాలకు మనమే బానిసలమై,
మన మేధస్సుకు మనమే విశాలమైన రెక్కలు తొడిగి, మన జీవితాలను మనమే ఛిద్రం చేసుకుంటున్నామో తెలియని ఒక సందిగ్ధం ఆవహించింది. అందమైన ప్రపంచంలో అపరిమితమైన అద్భుతాలను సృష్టించి, సైన్స్ ఫిక్షన్ కథల స్థాయిని దాటి, మానవ జీవితాలను ఒక తెలియని, వింత లోకాలకు తోడ్కొని పోయి అపరిమితమైన మానసికానందానికి గురిచేసి, కనీ వినీ ఎరుగని అనుభూతిని ఆస్వాదించే స్థితిని స్పృశించడానికి విజ్ఞాన గవాక్షాలు తెరచుకుంటున్నాయి.

## మనమెక్కడున్నాం?

ఒకప్పటి పరిస్థితులను సింహావలో కనం చేసుకుంటే అప్పటి మనమెక్కడ? ఇప్పటి మనమెక్కడ? అనే ఆశ్చర్యం కలగక తప్పదు. ఎడ్లబండ్ల నుండి ఎయిర్ బస్సుల వరకు మానవ విజ్ఞానం అనేక మలుపులు తిరిగింది. భూగోళం నుండి ఖగోళం వరకు మానవ ఆలోచనా పరిధి విస్తృత రూపం ధరించింది. మానవ మేధస్సు విస్తృతమై, నిరంతరం అనంతమైన విజ్ఞాన సాగర మథనం చేస్తూ, అలుపెరుగని శ్రమతో అద్భుతాలను సృష్టిస్తూ ప్రతిసృష్టి చేయగల సత్తా సాధిస్తున్న మానవ మహా విజ్ఞానాన్ని వేనోళ్ల ప్రశంసించక తప్ప దు. అడవుల్లో తిరుగుతూ ఆకులు, అలాలు ఆరగిస్తూ, వీలైనప్పుడల్లా జంతువులను వేటాడి, పచ్చి మాంసం భుజిస్తూ, అభద్రతా వాతావరణంలో ఆయువును అరచేతిలో పట్టుకుని జీవించే నాటి మానవుడెక్కడ? సకల జీవరాశులపై ఆధిపత్యం చెలాయిస్తూ ఆకాశాన్నంటిన భవంతుల్లో హాయిగా జీవించే నేటి మానవుడెక్కడ? నాగరికతకు దూరంగా జంతు సదృశమైన జీవన విధానంతో శతాబ్దాల చీకటి జీవితాలను గడిపిన ప్రాచీన మానవుడెక్కడ? నగ్నత్వం నుండి నాగరికత్వం వైపు అడుగులు వేసి, భువనం నుండి గగనం వరకు ఈ మహా విశ్వంలోని మాయను ఛేధించి, మహోన్నత శిఖరాలను తాకి, ఝుంఝూమారుతంలా దూసుకుపోతూ, గాఢాంధకారం నుండి విజ్ఞానమనే వెలుగు మార్గంలో వడి వడిగా పరుగులు పెడుతూ, కాలంతో పోటీ పడుతూ, భువిని స్వర్గతుల్యంగా చేయాలని ఆరాట పడుతున్న ఆధునిక మానవ విజ్ఞాన తృష్ణను కనులారా వీక్షిస్తూ, మనసారా ఆనందిస్తూ, అలవికాని, ఆసాధ్యమనుకున్న



అనుభూతిని ఆస్వాదిస్తూ, మానవ ప్రతిభను మహోన్నతంగా నిలిపిన ఆధునిక విజ్ఞాన మహత్తును ఆరాధించవలసిందే, అభినందించవలసిందే. ఇప్పుడు మానవ ఆలోచనా శక్తి కంటే అత్యంత వేగంగా కచ్చితమైన ప్రమాణంతో పని చేసే యంత్రాలు, కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చాయి. మానవ జ్ఞాపకశక్తి పరిమిత స్థాయిలో ఉంటుంది. ఒక్కోసారి అనారోగ్య కారణాల రీత్యా, వయసురీత్యా జ్ఞాపకశక్తి తరిగి పోవచ్చు. విపరీతమైన ఒత్తిడి, మానసిక, శారీరక రుగ్మతలు వంటి పలు కారణాల వలన మనిషిలోని తెలివితేటలు క్షీణించవచ్చు. అలాగే అధిక శ్రమతో కూడిన పనుల వలన మనిషి అలసటకు గురి కావడం జరుగుతుంది. నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి మనిషికి పట్టే సమయం కూడా ఎక్కువే. మనిషి చేసే పనిలో తప్పులు దొర్లడం కూడా సహజమే. ప్రమాదకరమైన పనుల్లో మానవ శక్తి వినియోగం వలన జరిగే అనర్థాలు ఊహాతీతం. మానవ శక్తిపై అధిక వ్యయం చేయడం తప్పదు. అయినప్పటికీ ఎక్కడో ఒక చోట వైఫల్యం చెందక తప్పదు. వీటిని అధిగమించి, సమయాన్ని, వృథా ఖర్చును అరికట్టి, అత్యంత నాణ్యమైన ఫలితాలను సాధించి లాభాలను ఆర్జించడానికి భవిష్యత్తులో అన్ని రంగాల్లో 'కృత్రిమ మేధ'(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కీలక పాత్ర వహించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా కృత్రిమ మేధను సంక్షిప్తంగా "ఎ.ఐ" అని పిలుస్తారు. కంప్యూటర్ల యుగంలో, ఆధునిక సాంకేతిక వ్యవస్థలో కృత్రిమ మేధ ఒక గొప్ప అద్భుతం. ఇది ఒక కంప్యూటర్ జనరేటెడ్ ఇంటెలిజెన్స్. మనిషి అందించే డేటా ఆధారంగా మనిషి తెలివితేటలను పోలినట్టుగా ఒక మిషన్ లేదా రోబో లేదా కంప్యూటర్ పనిచేయడం కృత్రిమ మేధ లక్ష్యం. భవిష్యత్తులో ఏ.ఐ.లో ప్రావీణ్యత సంపాదించడంలోనే ఉద్యోగ భద్రత ఆధారపడి ఉంటుందన్న సత్యాన్ని యువ ఇంజినీర్లు జీర్ణించుకోక తప్పదు. ప్రోగ్రామింగ్, మిషన్ లెర్నింగ్ వంటి అంశాలపై పట్టు సాధించ డం వలన ఏ.ఐ.లో ప్రావీణ్యత సాధించవచ్చు. భూత, భవిష్య వర్తమానాలను జ్ఞాపకం ఉంచుకుని మనిషి అందించే డేటా సాయంతో రోబోలు కానీ కంప్యూటర్ల ద్వారా పనిచేసే యంత్రాలు గానీ అత్యంత సమర్థవంతంగా తమ భూమిక పోషించగలుగుతాయి. కచ్చితత్వం, మనిషి కంటే అనేక రెట్ల సామర్థ్యం కృత్రిమ మేధ ద్వారా పనిచేసే మెషీన్ల స్వంతం. అందుకే వీటి పట్ల అనేక సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇప్పటికే గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి సంస్థలు ఏ.ఐ. పట్ల అధిక శ్రద్ధ చూపిస్తున్నాయి. భవిష్యత్తు అంతా కృత్రిమ మేధ స్వంతం కాక తప్పదు. యువత కూడా ప్రస్తుతం నేర్చుకుంటున్న అనేక కంప్యూటర్ కోర్సులతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాధాన్యం ఇవ్వక తప్పదు. ప్రోగ్రామింగ్, మిషన్ లెర్నింగ్‌లతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పట్ల యువ ఇంజినీర్లు ఆసక్తి చూపుతున్నారు. వేగంగా మారుతున్న పరిణామాలను ఆకళింపు చేసుకుని, ఎప్పటికప్పుడు వినూత్న పంథాలో నిరంతర విద్యార్థులా నేటి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు శ్రమించకపోతే, వారి ఉద్యోగ భద్రత కూడా ప్రశ్నార్థకమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రతీ సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కోర్సుల పట్ల మక్కువ చూపుతున్నారు.

ఇంజినీరింగ్ రంగంలో అనేక శాఖలున్నప్పటికీ, చదువు పూర్తయిన యువత పలుచోట్ల పనిచేసే అవకాశాలున్నప్పటికీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అనేది చదువుకున్న ప్రతీ ఒక్కరి కలగా, లక్ష్యంగా, నేటి యువతకు అదొక ట్రెండ్‌గా మారిపోయింది. ఇంజినీరింగ్ చదివినవారే కాకుండా, ఇతర డిగ్రీలు చదివినవారు కూడా కంప్యూటర్ కోర్సులు నేర్చుకుని, జీతం ఎంతయినా పర్వాలేదనే సర్దుబాటు ధోరణి ప్రదర్శిస్తూ, మల్టీనేషనల్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రతీ ఏడాది ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న సాఫ్ట్‌వేర్ ఆశావహులకు ఉద్యోగాలు కల్పించడం కష్టతరంగా మారింది. కొవిడ్ సంక్షోభవం సృష్టించిన ఆర్థిక విధ్వంసం వలన ఇప్పటికీ పలు ఎం.ఎన్.సి.లు పూర్తి స్థాయిలో నిలదొక్కుకోలేకపోయాయి. ఆయా కంపెనీల ఉద్యోగులు ఈనాటికీ పూర్తి స్థాయిలో ఆఫీసులకు హాజరు కావడం లేదు. చాలామంది ఉద్యోగులు 'వర్క్ ఫ్రమ్ హోం'కే మక్కువ చూపుతున్నారు. కొవిడ్ సంక్షోభం సమసిపోయి, సాధారణ పరిస్థితులు నెలకొనే తరుణంలో మూలిగే నక్క మీద తాటిపండు పడిన చందంగా, పుండు మీద కారం చల్లినట్టుగా ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న 'ఆర్థిక మాంద్యం' ప్రభావం వలన పలు బహుళజాతి కంపెనీలు నష్టాల బాట పట్టాయి. రెషిసన్ వలన చాలా మంది ఉద్యోగాలు డైలమాలో పడిపోయాయి. కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారు అరకొర జీతాలతో పని చేస్తున్నారు. ప్రస్తుతం అధిక జీతాలతో ఉద్యోగాలిచ్చే పరిస్థితులు లేని నేపథ్యంలో ఎడారిలో ఒయాసిస్సులా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్, రోబోటిజం వంటి అంశాలు ఆశాదీపంలా అగుపిస్తున్నాయి. అయితే పెరుగుతున్న జనాభాతో పాటు విద్యావంతుల శాతం కూడా బాగా పెరుగుతున్న నేపథ్యంలో అందరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పట్ల మక్కువ చూపడం వలన అందరికీ ఉద్యోగావ కాశాలు కల్పించే అవకాశాలు లేవు. పైగా సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా పెరిగింది. ప్రతీ రంగం టెక్నాలజీతో అనుసంధానిం చబడింది. ఉద్యోగార్థుల శాతం పెరిగింది. ఏదో కొద్ది మంది అత్యంత ప్రతిభావంతులకు తప్ప, గతంలో మాదిరిగా అందరికీ లక్షల్లో జీతాలిచ్చే పరిస్థితులు ఇప్పుడు లేవు. భవిష్యత్తులో కూడా ఉండవు. ఎక్కువ జీతాలిచ్చే పరిస్థితులు లేనందున మానవ శక్తిని తగ్గించి, యంత్రిక శక్తిని విరివిగా వినియోగంలోకి తీసుకువచ్చే ఆలోచనలు కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మానవ తెలివితేటలను కంప్యూటర్లకు అనుసంధానించి, చాకచక్యంగా అత్యంత సమర్థవంతంగా పనిచేయించగల సాంకేతిక పరిజ్ఞానానికి అంకురార్పణ చేయడం జరిగింది. దీనినే 'కృత్రిమ మేధ'గా పేర్కొంటున్నారు. దశాబ్దాల కిందట రూపుదిద్దుకున్న కృత్రిమ మేధ ప్రక్రియ పలు కారణాల వలన ఇప్పటివరకు వేగం సంతరించు కోలేదు. అయితే భవిష్యత్తులో కృత్రిమ మేధ 'ఏ.ఐ.'కే అత్యంత ప్రాధాన్యత లభించే అవకాశాలున్నాయి. ఒకప్పుడు గణిత సమస్యల సాధన కోసం విద్యార్థులు ఎంతగానో శ్రమించేవారు. ఎక్కాల పట్టికలతో కుస్తీ పట్టి లెక్కలు చేసేవారు. పెద్ద సంఖ్యలతో కూడిక లు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు చేసేవారు. దీని




వలన విద్యార్థులకు మొదట్లో శ్రమ అనిపించినా, అలవాటు పడిన తర్వాత అనేక అంశాల్లో ఈ సాధన బాగా ఉపకరించేది. అయితే తర్వాత వచ్చిన కాలుక్యులేటర్ విద్యార్థులకే కాకుండా, వ్యాపారులకు, ఇతరులకు గణిత సమస్యలకు ఉత్తమ సాధనంగా మారింది. దీనితో ఆలోచించే అవసరం తగ్గింది.

ఇప్పుడు ఎంత మేధావులకైనా మొబైల్‌లోని కాలుక్యులేటర్ సాయం లేనిదే చిన్న చిన్న గణిత సాధనలు కూడా సాధ్యం కాకుండా పోయాయి. అలాగే గడియారాలు పోయి డిజిటల్ వాచీలు, డిజిటల్ గోడ గడియారాలు, మొబైల్ క్లాక్స్ అందుబాటులోకి వచ్చాయి. గడియారంలో కదిలే గంటల, నిమిషాల, సెకన్ ముల్లులతో పని లేకుండా పోయింది. అలాగే ఒకప్పుడు రేడియోలో నాటకాలు, కథలు వింటుంటే మన ఆలోచనా శక్తి పెరిగేది. రేడియో అనే శ్రవణ సాధనం వలన మన మనోఫలకంపై దృశ్యాన్ని ఊహించు కుని ఆ సన్నివేశాన్ని కళ్లముందు కనిపించేటట్టు చేసే ఊహాశక్తి మనలో ఉండేది. టెలివిజన్ ఆవిష్కరణతో ఆకాశవాణి ప్రాభవం అంతరించిం ది. శబ్దంతో పాటు దృశ్యం కూడా తెరపై కనిపించడంతో మన ఊహాశక్తికి పదును పెట్టే అవసరం లేకుండా పోయింది. అలాగే ఉత్తరాలు రాయడంలో ఎంతో భావుకత, కళాత్మకత గోచరించేది. మొబైల్ ఫోన్ల వలన, ఉత్తరాల శకం ముగిసింది. ఇలా మానవ మేధస్సుతో జరిగిన, జరుగుతున్న మార్పుల ప్రక్రియ మానవ మేధస్సునే హరిస్తున్నది. ఆలోచనా శక్తి క్షీణిస్తున్నది. జ్ఞా పకాలను మస్తిష్కంలో బంధించే అవసరం లేకుండా కంప్యూటర్ల హార్డ్ డిస్కులు, ఇతర సాంకేతిక వ్యవస్థలు మానవ మస్తిష్కానానికి పని లేకుండా చేస్తున్నాయి. ఇలా ఒకటేమిటి.. అనేక ఎలక్ట్రానిక్ సాధనాలు మానవ జీవితంలో తిష్ఠ వేసాయి. ఇవన్నీ సాంకేతిక విప్లవం తెచ్చిన మార్పులు. ఎప్పుడైతే మనం సులభతరమైన పద్ధతులకు అలవాటు పడ్డామో, యంత్రాల సహాయంతో మన పనులను చక్కదిద్దడం మొదలుపెట్టామో, అప్పటి నుండే మన జీవితాల్లో 'కృత్రిమ మేధ యుగం' మొదలైందని చెప్పవచ్చు. కృత్రిమ మేధతో మన తెలివితేటలను యంత్రాలకు, కంప్యూటర్లకు అప్పగించినట్టే. అయితే ఈ ఆధునిక యుగంలో పరిశోధనలు మరింత వేగంగా సాగుతూ, సాంకేతిక వ్యవస్థలు అత్యంత అధునాతన పరిజ్ఞానాన్ని సంతరించుకుని 'రోబో' యుగాన్ని స్వాగతిస్తున్నది. దీని పర్యవసాన ఫలితమే ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ల ప్రవేశానికి మార్గం సులభతరం చేసింది. రోబో చలన చిత్రంలోని కల్పితాలు నేడు వాస్తవమై కృత్రిమ మేధ రూపంలో మన చెంతకు అరుదెంచాయి. ఒకవైపు టెక్నాలజీ సాయంతో మానవ జీవితం విప్లవాత్మక మార్పు సంతరించుకుంటుని సంతోషించాలో, కృత్రిమ మేధ వలన రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు ఏర్పడతాయోనని ఆందోళన పడాలో అర్థం కావడం లేదు. ఇప్పటికే చదువుకున్న వారు, చదువు లేనివారు సైతం స్మార్ట్‌ఫోన్ విన్యాసాలకు అలవాటు పడ్డారు. ఇంటర్నెట్ వాడకం విపరీతంగా పెరిగింది. అసభ్యమైన దృశ్యాలకు, మోసాలకు ఆన్‌లైన్ అడ్డాగా మారింది.

'యూట్యూబ్' సంపాదనకు ఒక దగ్గర దారిగా మారింది. మంచికి లైకులు, షేర్లు, సబ్‌స్క్రైబ్‌లు ఉండవు. నగ్నంగా అసభ్యంగా చిత్రీకరించి, సాంఘిక మాధ్యమాల్లో చొప్పిస్తున్న వీడియోలకు, కథనాలకు విపరీతమైన ఆదరణ పెరిగింది. యువత బలహీనతను ఆసరాగా చేసుకుని అనేక యూట్యూబ్ ఛానళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా మారిన కొంతమంది యూట్యూబర్లు మంచి-చెడు విచక్షణ మరచిపోయి, వ్యక్తిగత జీవితాలను సైతం బయటకు లాగి, కుటుంబ వ్యవస్థలను నాశనం చేస్తూ, విలువలకు తిలోదకాలి స్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలను కూడా సాంఘిక మాధ్యమాల ద్వారా ప్రదర్శిస్తూ, ఆదిమానవ సంస్కృతిని అధునాతన సంస్కృతిగా వర్ణిస్తూ, ఇలాగే జీవించాలనే మాదిరిగా సమాజంపై విషం చిందిస్తున్నారు. పెరిగిన టెక్నాలజీ ఇందుకు దోహదం చేస్తున్నది. నిర్మాణాత్మకమైన పాత్ర పోషించవలసిన టెక్నాలజీ ఈ విధంగా మానవ జీవితాలను ఛిద్రం చేయడం చూస్తున్నాం. డేటా చౌర్యంతో గోప్యత ప్రశ్నార్థకంగా మారింది. టెక్నాలజీ తెచ్చిన మార్పులతో మంచి కంటే చెడు ఎక్కువగా జరుగుతున్నది. కృత్రిమ మేధతో జరగబోయే విపత్కర పరిణామాల గురించి సాంకేతిక రంగ నిపుణులు తమ ఆలోచనలను, అభిప్రాయాలను ప్రజలతో పంచుకోవాలి. మానవ విజ్ఞానంతో సృష్టించిన 'కృత్రిమ మేధ' మానవాళికే పెనుముప్పుగా మారుతుందనే కథనాలు వినబడుతున్నాయి. ఈ సందర్భంగా మనం చిన్నతనంలో చదివిన ఒక కథ గుర్తుకు వస్తున్నది. ఒక శాస్త్రవేత్త ఒక నిర్మానుష్య ప్రదేశంలో చచ్చిపడి ఉన్న సింహం కళేబరాన్ని చూసి, దానికి జీవం పోయాలనే ఆసక్తి కనబరిచాడు. ఆ శాస్త్రవేత్త తన విజ్ఞానంతో ఆ సింహాన్ని పునర్జీవింపచేయగా, ఆ సింహం తనను బతికించిన ఆ శాస్త్రవేత్తకు తన పంజా రుచి చూపించి, చంపింది. కృత్రిమ మేధ కూడా ఈ కథ మాదిరిగానే చివరికి మానవులనే శాసించి మానవుల ఆలోచనా శక్తిని, కష్టించే తత్వాన్ని హరించి అధోగతి పాలు చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మనం సృష్టించిన కృత్రిమ మేధ భస్మాసుర హస్తం కారాదు. ఇప్పటికే మన చెంతకొచ్చిన సాంకేతిక మన జ్ఞానాన్ని, సృజనాత్మకతను హరించి, మనిషిని మరబొమ్మగా మార్చిన వైనం చూస్తు న్నాం. ఇక కృత్రిమ మేధ మానవ జీవితాలపై ఎలాంటి ప్రభావం తీసుకువస్తుందో ఊహించడానికే భయంగా ఉంది.



**కంప్యూటర్ ఆవిష్కరణ ఓ అద్భుతం**

కంప్యూటర్ అనేది ఒక అద్భుతమైన మానవ నిర్మిత ఎలక్ట్రానిక్ సాధనం. ఇప్పటివరకు సైన్స్ సాధించిన ప్రగతి, సైన్స్ ద్వారా జరిగిన ఆవిష్కరణలు ఒక ఎత్తయితే మానవ విజ్ఞానం కొత్త పుంతలు తొక్కడంలో కంప్యూటర్ ఆవిష్కరణ ఒక ఎత్తు. అవధులు లేని మానవ విజ్ఞానానికి పరాకాష్ఠ కంప్యూటర్ ఆవిష్కరణ. టెలిఫోన్ల నుండి మొబైల్ ఫోన్ల వరకు, రేడియో నుండి టెలివిజన్ వరకు, టెలీస్కోప్ నుండి మైక్రోస్కోప్ వరకు ఒకటేమిటి.. రాకెట్లు, రోబోలు వంటి ఆవిష్కరణలతో మానవ ప్రపంచంలో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయి. మానవ మేధస్సును అత్యున్నతంగా నిలబెట్టిన అద్భుతమైన కంప్యూటర్ ఆవిష్కరణతో మానవుడు భువన, గగనాలను శాసించే స్థితికి చేరుకున్నాడు. మానవ జిజ్ఞాసకు అత్యున్నతమైన రూపకల్పన కంప్యూటర్. నేడు విద్య, వైద్య రంగాలతో పాటు సమాచార వ్యవస్థలో కంప్యూటర్ల పాత్ర కీలకంగా మారింది. టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థలో చోటు చేసుకున్న అనిర్వచనీయ మైన మార్పులను నేడు మనం ప్రత్యక్షంగా అనుభవిస్తూ, మన జీవితంలో ఒక భాగంగా మార్చుకున్నాం. స్మార్ట్ ఫోన్ల వినియోగంతో ప్రపంచం మన ముందు సాగిలబడి, మనకు పాదాక్రాంతమైన అనుభూతి ఏర్పడింది. అలాగే కంప్యూటర్ రంగంలో అనేక మార్పులు సంభవించాయి. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కంప్యూటర్లు అన్ని రంగాల్లో ప్రవేశపెట్ట బడ్డాయి. కమ్యూనికేషన్ వ్యవస్థలు, బ్యాంకింగ్ రంగం, ఇతర ఆర్థిక వ్యవస్థలు, రైల్వేలు, విమానాలు, రక్షణ, అంతరిక్ష రంగాలన్నీ కంప్యూటర్లతో అనుసంధానిం చబడి పని చేస్తున్నాయి. మానవ మేధస్సుకు కంప్యూటర్ ఒక నిదర్శనం. మానవ విజ్ఞానంలో ఇదొక మైలురాయి. అధునాతన టెక్నాలజీతో కూడిన కంప్యూటర్లు లేనిదే నేడు మానవ జీవితం స్తంభించిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో మార్పులను సంతరించుకుని ఎన్నో అధ్యయనాలు, పరిశోధనల తర్వాత 'కృత్రిమ మేధ(ఎ.ఐ.)' అనే ఒక వినూత్న ప్రక్రియ సమస్త వర్తమాన మానవ ప్రపంచాన్ని ఒక్క కుదుపు కుదిపి ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. ఈ పరిణామాల వలన భవిష్య మానవ జీవన ముఖచిత్రం సమూలంగా మారిపోయే అవకాశాలున్నాయి. 'కృత్రిమ మేధ' వలన ఒకవైపు ఆనందం, మరోవైపు భయం తొంగి చూస్తున్నాయి. ఈ విషయా లను ప్రస్తావించే ముందు కంప్యూటర్‌కు సంబంధించిన మూలాల గురించి క్లుప్తం గానైనా ప్రస్తావించడం సముచితం, సందర్భోచితం.

**కంప్యూటర్ ఆవిష్కర్త..**

లండన్‌కు చెందిన ఛార్లెస్ బాబేజ్ కంప్యూటర్ ఆవిష్కర్త. అయితే ఆధునిక కంప్యూటర్ ఆవిష్కర్తగా యు.కె.కు చెందిన కంప్యూటర్ శాస్త్రవేత్త అలాన్ ఎమ్. టూరింగ్ విశేషమైన ఖ్యాతి గడించాడు. కృత్రిమ మేధస్సు రూపొందడానికి 1950లో టూరింగ్ వెలువరించిన 'కంప్యూ టర్ మెషినరీ అండ్ ఇంటెలిజెన్స్' ప్రచురణ దోహదం చేసింది. యంత్రాలు మానవుల్లా ఆలోచించగలవా? అనే సందేహం వినూత్న మైన పరిశోధనలకు ప్రేరణగా మారింది. ఒక యంత్రం మనిషిలా ఆలోచించాలి, దానిలో చలనం కలగాలి అనే విధంగా సాగిన టూరింగ్ ఆలోచనలు కృత్రిమ మేధస్సుకు దారి తీసాయి. ఈ అంశంపై అతను చేసిన విశేషమైన కృషి కంప్యూటర్ మేధస్సుగా, కృత్రిమ మేధగా పరిగణింపబడింది.

టూరింగ్ చేసిన పరిశోధనలు ప్రపంచ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించడమే కాకుండా ఈనాటి వేగవంతమైన కంప్యూటర్ విజ్ఞానానికి బాటలు వేసాయి. మానవ విజ్ఞానంతో అనుసంధానం చేయబడిన కంప్యూటర్ పరిజ్ఞానంపై విశేష కృషి చేసిన అమెరికాకు చెందిన జాన్ మెక్ కార్తి కృత్రిమ మేధకు నామకరణం చేసిన వ్యక్తిగా ఫాదర్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌గా పేరు గాంచాడు. అమెరికాకు చెందిన గ్రేస్ హోపర్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌ల అభివృద్ధిలో, అమెరికా, హంగేరీ శాస్త్రవేత్త జాన్ వోన్ న్యూమాన్ ఎలక్ట్రానిక్ డిజిటల్ కంప్యూటర్ విషయంలో కీలక పాత్ర పోషించాడు. బ్రిటీషు శాస్త్రవేత్త అదా లవ్ లేస్ మొదటి కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా పేరు పొందారు. అమెరికాకు చెందిన మార్విన్ మిస్కీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏ.ఐ.)లో, కెనడాకు చెందిన జేమ్స్ గాస్లింగ్ జావా ప్రోగ్రామింగ్‌లో ప్రముఖ పాత్ర వహించారు. ఇలా ఎంతో మంది ప్రముఖులు అహరహం శ్రమించి, ఒక్కో అడుగు ముందుకేసారు. అందరి అడుగులు సుదీర్ఘ ప్రయాణాన్ని సులభతరం చేసాయి. వారి శ్రమకు ఫలితమే కృత్రిమ మేధ. వివిధ రంగాల్లో నెలకొన్న సంక్లిష్ట సాంకేతిక సమస్యలను పరిష్కరించడం, అధిక ఖర్చులకు కళ్లెం వేయడం, సమయాన్ని ఆదా చేయడం, ఉత్పాదకత పెంచడం, ఏ.ఐ. సాధనాలతో, అలసట ఎరుగని రోబోలతో 24 గంటలు పని చేయించడం కృత్రిమ మేధ వలన సుసాధ్యం కాగలదు. కృత్రిమ మేధ వేగవంతమైన ప్రపంచంలో ఉత్తమమైన సేవలను అందిస్తుంది. ఏ.ఐ. ప్రపంచంలోకి ఇప్పటికే అడుగులు పడ్డాయి. ఇక ఏ.ఐ. వలన ఒనగూరే లాభ నష్టాలను గురించి విశ్లేషిద్దాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ ప్రక్రియల వలన సాంకేతికతకు సంబంధించి సత్వర నిర్ణయాలు తీసుకోవడం సాధ్యపడుతుంది. కమ్యూనికేషన్, రవాణా, వైద్య తదితర రంగాల్లో గణనీయమైన మార్పులు సంభవించి ఆర్థిక ఎదుగుదల, నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడతాయి. సాంకేతిక సామర్థ్యంతో వ్యాపారం మెరుగు పడుతుంది. రోగులను కచ్చితమైన ప్రమాణా లతో డయాగ్నోసిస్ చేయడం, సత్వర చికిత్సలు, శస్త్రచికిత్సలు చేయడం, ఇంటివద్ద నుండే వైద్య పరీక్షలు చేసి మానిటరింగ్ చేయడం జరుగుతుంది. కృత్రిమ మేధ(ఏ.ఐ.) ప్రభావంతో రాగల రోజుల్లో ప్రతిభావంతులైన యువత ఉపాధికి ఏవిధమైన నష్టం జరగదనే అభిప్రాయముంది. నైపుణ్యత లేని చదువులతో డిగ్రీలు సంపాదించి, కొన్ని కంప్యూటర్ కోర్సులు నేర్చు కుని, ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా మారుతున్న వారికి భవిష్యత్తులో కృత్రిమ మేధ ఒక శరాఘాతంలా పరిణమించవచ్చు. కృత్రిమ మేధ వలన ఉద్యోగావకాశాలు తగ్గి, రోబోల ఆధిపత్యం మొదలయ్యే అవకాశం ఉందనే కథనాలు వెలువడుతున్నాయి.



## లాభనష్టాలెంత?

మానవ భద్రతకు, వివిధ దేశాల రక్షణ వ్యవహారాలకు కృత్రిమ మేధ వలన ఒక విధంగా లాభం, మరొక విధంగా నష్టం జరిగే అవకాశముందనే వార్తల్లో నిజమెంతో తెలియాలి. భవిష్యత్తులో మనం ఉపయోగిస్తున్న కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర రవాణా వ్యవస్థలు ఏ.ఐ.సహకారంతో నడిచే అవకాశాల వలన భారీ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారముంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ ప్రక్రియలు మానవ నిర్మిత అత్యంత ఆధునిక సాంకేతిక వ్యవస్థలు. మనిషి సృష్టించిన టెక్నాలజీని మాయచేసి, వైరస్‌లను ప్రవేశపెట్టి సాంకేతికతో నడుస్తున్న వ్యవస్థలను విధ్వంసం చేసే ప్రమాదం లేకపోలేదు. ఏ.ఐ.తో రాగల ముప్పును క్షణాల్లో నిలువరించగల సామర్థ్యం లేకపోతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదముంది. ప్రపంచ వ్యాప్తంగా మొబైల్స్, కంప్యూటర్లలోకి వైరస్‌లు ప్రవేశించి, డేటాను విచ్ఛిన్నం చేయడం, వివిధ వ్యవస్థలు స్తంభించిపోవడం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధతో నడిచే కంప్యూటర్ల వలన, యంత్రాల వలన భారీ విపత్కర పరిణామాలు సంభవించగలవని ఆందోళన నెలకొని ఉంది. మనిషి మాయమై మరబొమ్మలే ప్రాణం పోసుకుని, మనిషి జీవితాన్ని చక్రబంధంలో ఇరికించే ముప్పు పొంచి ఉంది. కీలక వ్యవస్థలు కృత్రిమ మేధతో పని చేస్తే, కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో లోపాలున్నా, సాంకేతిక సమస్యలు తలెత్తినా సంభవించగల పరిణామాలు ఊహాతీతం. రాబోయే దశాబ్ద కాలంలో సుమారు 100 కోట్ల మందికి పైగా కృత్రిమ మేధ వలన ఉద్యోగాలు కోల్పోయే అవకాశముందని నిపుణుల వాదన. కృత్రిమ మేధ వలన ఇకముందు టీ.వి. సీరియల్స్‌లోను, యాంకరింగ్, న్యూస్ రీడింగ్ వంటి అంశాల్లోనూ మనుషుల స్థానంలో ఏ.ఐ. ఆధారిత సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలను తోసిపుచ్చలేం. ఇటీవల ఒడిస్సాలో కృత్రిమ మేధ ద్వారా 'లీసా' అనే కృత్రిమ మహిళా న్యూస్ యాంకర్‌ను సృష్టించి, ఒక ప్రైవేట్ ఛానల్‌లో న్యూస్ చదివించిన విధానం చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. ఇదే పద్ధతి భవిష్యత్తులో సినిమా ప్రపంచంలోను, టెలివిజన్ రంగంలోను ప్రవేశపెడితే, ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేసేవారికి ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకం కాగలదు. ఉద్యోగ అవకాశాలను పోగొట్టకుండా, పెరుగుతు న్న విద్యావంతుల ఉపాధికి నష్టం లేకుండా చూడాలి. ఎంతవరకు కృత్రిమ మేధ అవసరముందో, అంతవరకే వినియోగించాలి. ఏ.ఐ. ప్రవేశం కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారకూడదు. మానవ శక్తికి వీలు కుదరని చోట్ల, ప్రమాదకరమైన పనుల్లోను, ఇతర సంక్లిష్టమైన కార్యకలాపాల్లోను కృత్రిమ మేధను వినియోగించి, అభివృద్ధిని సాధించవచ్చు. ఈ దిశగా కంప్యూటర్ రంగంలోని నిష్ణాతులు, ఏ.ఐ. నిపుణులు తమ ఆలోచనా పరిధిని విస్తృతం చేయాలి. కోతి నుంచి పరివర్తన చెంది, ఉన్నతమైన విలువలను నిర్మించు కుని, ఆటవికం నుండి ఆధునికంగా మారి, దానవత్వం నుండి మానవత్వం వైపు నడక సాగించి, చీకటిని ఛేదించి వెలుతురును జన జీవితాల్లో ప్రసరింపచేసి అజ్ఞానాన్ని హరించి విజ్ఞానం వైపు పరుగులు తీసే క్రమంలో ఎక్కడో మనసులో అల్లుకుపోయిన కోరికలు కదం తొక్కి, ఏదో సాధించేద్దామనే కసితో, కృషితో మనల్ని మనమే సాధించుకుంటున్నాం. మన స్వేచ్ఛను మనమే హరించుకుంటున్నాం. మన జ్ఞానాన్ని మనమే అజ్ఞానంగా మలచుకుంటున్నాం. ఇకనైనా టెక్నాలజీ పంథా మారాలి. మానవ జీవితం సౌకర్యవంతంగా సాగడానికి మాత్రమే సాంకేతికత వినియోగపడాలి. కృత్రిమ మేధలో ఉపయోగించే మరబొమ్మలు, మానవులను మరమనుషులుగా మార్చకుండా, ఉపాధికి గండి కొట్టకుండా, ప్రపంచ దేశాల ఆర్థికాభివృద్ధిని పెంచి, విద్యాధిక యువత భవితను ఉజ్వలంగా మార్చాలని కోరుకోవడం అత్యాశ కాబోదు. ❑





# సిమెంట్ లేకుండా ఇల్లు

ఇటీవల సిమెంట్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. సిమెంట్ లేకుండా చిన్న నిర్మాణాన్నీ ఊహించలేం. అలాంటిది పుణె యువజంట ధ్రువంగ్ హింగ్‌మైర్, ప్రియాంక గుంజికార్ ఏకంగా ఫామ్‌హౌజ్‌లు, బహుళ అంతస్తుల బంగ్లాలే నిర్మిస్తున్నారు. ఏసీ అమర్చినట్టు లోపల చల్లచల్లగా ఉండటం వీటి ప్రత్యేకత. ముంబయిలో నెలకి లక్షల జీతం తీసుకునే ఈ జంట ఓసారి మహారాష్ట్రలోని ఓ మారుమూల పల్లెకు వెళ్లినప్పుడు అక్కడ ఒక మహిళ మట్టితో సొంతంగా చిన్న ఇంటిని నిర్మించుకోవడం గమనించారు. గోడలు దృఢంగా ఉండటానికి ఆమె మట్టిలో చేతిగాజులు కలిపానని వాళ్లతో చెప్పింది. ఆ మాట వాళ్లలో ఆసక్తి రేపింది. తమకున్న అనుభవంతో ఏదైనా కొత్తగా ప్రయత్నించాలి అనుకున్నారు. రకరకాల ప్రయోగాలు చేసి, మట్టి, ఇసుక, సున్నం మిశ్రమంతో సిమెంటుకి ప్రత్యామ్నాయం రూపొందించారు. ఇటుకలు, బురద, నాపరాయి, బ్లాక్‌స్టోన్, స్థానికంగా దొరికే కలప, మట్టిపెంకులతో పుణెకి సమీపంలోని కమ్షెట్‌లో ఒక ఇంటిని నిర్మించారు. పునాది తీయడం నుంచి కప్పు వేయడం వరకు ప్రతి దశలో ప్రయోగాలు చేశారు. అతితక్కువ ఖర్చయ్యే ప్రణాళికలు అమలు పరిచాయి. దాంతో ఈ సరికొత్త నిర్మాణం పూర్తవడానికి దాదాపు రెండేళ్లు పట్టింది. సిమెంట్ పూర్తిగా వాడకపోవడం, సహజంగా గాలి ప్రవహించేలా డిజైన్ ఉండటంతో ఇంటి లోపల ఉష్ణోగ్రత బయటికన్నా పది నుంచి పదిహేను డిగ్రీలు తక్కువగా ఉంటుంది. అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవడంతో మామూలు ఇంటితో పోల్చుకుంటే సగం ఖర్చుతోనే నిర్మాణం పూర్తైంది. మొదటి ప్రాజెక్టు సూపర్ సక్సెస్ కావడంతో ఆ ఉత్సాహంతో మరో ఆరు ఇళ్లను నిర్మించింది జంట. ప్రస్తుతం ఈ ఇద్దరు పూర్తి సమయాన్ని ఈ సృజనాత్మక ఇళ్ల నిర్మాణం కోసమే కేటాయిస్తున్నారు.

# తాజా కూరగాయలు



కూరగాయలూ, పండ్లు తాజాగా ఉంటే వాటికి ఉండే గిరాకీనే వేరు. కానీ అధిక ఉష్ణోగ్రత, మార్కెట్ కోసం సుదూరాలు సరఫరా చేయడంవల్ల అవి తాజాదనాన్ని కోల్పోవడమే కాదు, కొన్నిసార్లు కుళ్లిపోతుంటాయి కూడా. ఈ కారణంగానే మన దేశంలో పండ్లూ, కూరగాయలు 30శాతం వృథాగా పోతుంటాయి. దీనివల్ల రైతులకే కాదు, వినియోగదారుల కూ..నష్టమే. ఈ సమస్యని పరిష్కరించడానికే వచ్చింది 'సబ్జీకోఠి' సరకు నిల్వకూ, రవాణాకూ ఉపయోగపడే టెంటులాంటి నిర్మాణాలివి. బిహార్‌కు చెందిన నిక్కీ కుమార్ ఝా వీటిని అభివృద్ధి చేశారు. సాధారణంగా కూరగాయలూ, పండ్ల నుంచి ఎథిలీన్ వాయువు విడుదల కావడంవల్ల అవి తొందరగా పాడైపోతాయి. సబ్జీకోఠీలో ఓ ప్రత్యేక వాతావరణం సృష్టించి ఎథిలీన్ విడుదలని దాదాపు తగ్గించి..పండ్లూ, కూరగాయలు నిల్వ ఉండే కాలాన్ని 3-15 రోజులు పెంచుతారు. చూడ్డానికి టెంటులా కనిపించే ఒక రకమైన ఇన్సులేటింగ్ ఛాంబర్ ఇది. బిహార్‌లోని నలంద యూనివర్శిటీలో పీజీ చేస్తున్న సమయంలో తన ప్రాజెక్టులో భాగంగా నిక్కీ దీన్ని ప్రాథమికంగా రూపొందించాడు. ఆపైన జమ్మూలోని అగ్రికల్చరల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ యూనివర్శిటీ-కాశ్మీర్ ఇంక్యుబేషన్ కేంద్రంలో దీన్ని అభివృద్ధి చేశాడు. ప్రస్తుతం ఐఐటీ కాన్పూర్ యాక్సెలిరేటర్ కార్యక్రమానికి ఎంపికైంది. వీటిలో రైతులు కూరగాయలూ, పండ్లని నిల్వ చేసుకోవడానికి ఉపయోగపడేలా ఒక రకాన్నీ, చిరువ్యాపారాలు అమ్ముకోవడానికి అవసరమైన బండిలాంటి మరో రకాన్నీ అభివృద్ధి చేశారు. రూ.10వేలు, రూ..20 వేల చొప్పున వీటి ధరలున్నాయి. ఇవి బ్యాటరీతో, సౌరవిద్యుత్తుతోనూ పనిచేస్తాయి.




# చిన్ననాటి స్మృతులు

**చిన్ననాటి** ఆటలు చిందులేసే ఆటలు
నేర్పే ఎన్నో పాఠాలు.. నేర్పే ఎన్నో పాఠాలు
'కాళ్లా గజ్జా కంకాళమ్మ' పాడుకున్న పాటలు
తెలిపే ఎన్నో వ్యాధులు.. నేర్పే ఎన్నో పాఠాలు
నేర్పే ఎన్నో పాఠాలు/ చిన్ననాటి ఆటలు చిందులేసే ఆటలు
నేర్పే ఎన్నో పాఠాలు.. నేర్పే ఎన్నో పాఠాలు
'కొంగా కొంగా పాలు పొయ్యి' పాడుకున్న పాటలు
వెర్రితనపు గుర్తులు చిలిపితనపు చేష్టలు
చిలిపితనపు చేష్టలు
చిన్ననాటి ఆటలు చిందులేసే ఆటలు
నేర్పే ఎన్నో పాఠాలు.. నేర్పే ఎన్నో పాఠాలు
క్రబిళ్లా ఆటలు.. గోళీలతో పోటీలు
మట్టితోటి ఆటలు పెనవేసెను ఎన్నో
బంధాలు
పెనవేసెను ఎన్నో
బంధాలు
చిన్ననాటి
ఆటలు
చిందులేసే ఆటలు
నేర్పే ఎన్నో పాఠాలు నేర్పే ఎన్నో
పాఠాలు
స్నేహితులు పంచిన అప్పచ్చులు, తిన్న కాకి ఎంగిళ్లు
ఇంకిపోని గుర్తులూ
మనసుపై చెరగని ముద్రలు/ మనసుపై చెరగని ముద్రలు
చిన్ననాటి ఆటలు చిందులేసే ఆటలు
నేర్పే ఎన్నో పాఠాలు.. నేర్పే ఎన్నో పాఠాలు
వర్షపు నీటిలో చేసిన కాగితపు పడవలు
తడిసిన మేని హృదయాలు
అమ్మచేతి చీవాట్లు నాన్నతోటి గారాలు
మరువలేని జ్ఞాపకాలు.. మరువలేని జ్ఞాపకాలు
చిన్ననాటి ఆటలు చిందులేసే ఆటలు
నేర్పే ఎన్నో పాఠాలు.. నేర్పే ఎన్నో పాఠాలు.

- అమృత జోత్స్న

## నిదురించే వేళలో!

నీవు హాయిగా నిదురిస్తుంటే
నా మనసు హాయిగా ఊపిరి
పీల్చుకుంటుంది.
అందుకే..
నీవు శయనించిన పాన్పుకు చెప్పాను,
అలసట తీర్చుకుంటున్న
నీ శరీరాన్ని సుతిమెత్తగా తాకమని!
నీ గదిలో తారాడే గాలికి చెప్పాను,
చిరుచెమటలొస్తున్న చోట
మెల్లగా చేరి చల్లార్చమని.
నీ పరిసరాల్లోని పూలతీగలకు
చెప్పాను,
వాటి కదలికలను నెమ్మదించమని.
నీ గది బయట ప్రకృతిని
హెచ్చరించాను,
ఏ బీభత్సం చేయక ఒద్దికగా
ఉండమని!/ నీలో వున్న నా గుండెను
వేడుకున్నాను,
కాస్త మెల్లిగా స్పందించమని!
ప్రశాంతంగా నిదురించే
నీ మోమునే చూస్తూ ఉన్న
నా నయనాలను కూడా బెదిరించాను
తదేకంగా చూస్తూ నీకు దిష్టి
తగిలించొద్దని.

- మైత్రి

## అవ'తారా'ం

నాడు ఎక్కడో చూసింది తనని
నేడు తన భర్తను చేసుకొని
కలగలసిపోయిందామె!
ఒకసారి చూస్తేనే అన్నీ అర్థమైనట్లు
ఎంతమంది పిల్లల్ని కంటేగాని
పెనవేసుకున్న బంధం-
విడదీయనంత గట్టి పీఠముడి
వేసుకుంది!
మధ్యల్లో తెగిపోతుందనుకున్న
దారపు బంధం
పిల్లల వల్ల మనవళ్లను ఒడిసి
పట్టుకొని
జోలపాటలు పాడిస్తూ
ఒలలాడిస్తోంది తాను!
ఆమె ఎవరో ఎవరికీ తెలియదు
అంతకుముందు
భర్తనే రూపం
ఉండకపోతే
తానంటూ లేకుండా
పోతే
పిల్లలు ఎవరో..
మనమలు ఎవరో
ఎవరికి ఎవరో
ఎప్పుడు ఎక్కడో..
తెలియనే
తెలియదు!
సృష్టిలో సృష్టించినదంతా
ఎవరి వశమో కాకుండా
వృధాగా పోదు.
నేడు నువ్వు
రేపు నేను
ఆ మరునాడు మరి ఎవరో
కొత్త రూపాలు తగిలించుకొన్న
కొంగొత్త అవ'తారా'లమే కదా
మనమంతా!

- చలపాక ప్రకాష్



## పుస్తక సమీక్ష

# అచ్చిక బుచ్చికల ముచ్చట్లు



అచ్చికబుచ్చికలాడటం అంటే కబుర్లు చెప్పుకోవడం. ఉమాదేవి ఇల్లెందుల (కల్వకోట) దాదాపు మూడు సంవత్సరాలు, ప్రతిగురువారం ఫేస్‌బుక్ వేదికగా, ఈ శీర్షికను నిర్వహించి పుస్తకరూపంలో తీసుకువచ్చారు. ప్రతి ఎపిసోడ్, జోక్‌తో ముగించడం, విశ్లేషించిన అంశాలకు పరిష్కారమార్గాలు కూడా సూచించారు. 156 వారాలు కొనసాగిన ఈ బుచ్చికల ముచ్చట్లు, రచయిత్రి సృజనాత్మక ప్రతిభకు అద్దం పడుతున్నాయి. చదువరులను ఆకట్టుకోగల కబుర్లుగా ఎటువంటి అరమరికలు లేకుండా కష్టసుఖాలు, ఆనందాలు, అన్నీ నేస్తాలతో అనుభవాలు, భావాలు పంచుకొనే వినూత్న ప్రక్రియగా రచయిత్రి తన అభిప్రాయాలు వ్యక్తీకరించారు. ఈ పుస్తకంలోని 100 అంశాలలో గానగంధర్వుడి పయనం, తండ్రి మరణం కారణంగా రచయిత్రి సాంత్వన కోరడం, కరోనా కబుర్లు, ఎన్నో సంఘటనలు కబుర్లుగా వున్నా కాలక్షేపం కబుర్లుగా హాస్యగుళికలతో ఎన్నో విషయాలు దొర్లిపోయాయి. కేవలం ఉబుసుపోక కబుర్లుగా అనిపించినా ఉమ్మడి కుటుంబాలు, కలిసిమెలిసి ఆటపాటలు, పండుగల పట్ల శ్రద్ధాసక్తులు, బంధుమిత్రుల ఆత్మీయతలను స్పృశించే ఆహ్లాదం ఈ అచ్చికబుచ్చికలతో రచయిత్రి సంభాషణా చాతుర్యం ఆకట్టుకొంటోంది. తాంబూలాలిస్తున్నా..! అనటం కూడా అచ్చికబుచ్చికలను మరింత అర్థవంతంగా నిండుతనం చేకూర్చింది. చలం మ్యూజింగ్స్ మాలతీ చందూర్ ప్రేమదావను, పురాణంసీతాగారి ఇల్లాలిముచ్చట్లు, లత, జానకిరామ్ తమ భావోద్వేగాలు, అనుభవాలు, ఆలోచనలు అంతరంగ కథనాలుగా చదువరులతో పంచుకొన్నట్టే ఉమాదేవి అచ్చికబుచ్చికలు అలరిస్తున్నాయి.

**(అచ్చికబుచ్చికలు, రచన: ఉమాదేవి ఇల్లెందుల, వెల: రూ 200, ప్రతులకు: ఫ్లాట్ 205, బ్లాక్ ఎ, అపార్ట్‌మెంట్స్, చిక్కడపల్లి, హైదరాబాద్)**

**- యర్రమిల్లి**

# తెలంగాణలో బోల్షివిక్ విప్లవ మూలాలు

'ఐదు తరాలు'ను రచయిత గులాబీల మల్లారెడ్డి 'కథలు' అన్నారు. కాని నిజానికివి కథలు కావు. యదార్థాలు. సుమారు 150 ఏళ్లక్రితం అంటే, ప్రపంచపు రాజకీయాలను పెనుమార్పుకు గురిచేసిన 'బోల్షివిక్' విప్లవం (1917-1921) కంటే ముందే, దేశంలో సిపాయిల విప్లవం (1887) పచ్చిపాల లక్ష్యయ్య అనే యువకుడు నాటి ఎల్లందుల కోట



నిర్మాణానికి వెట్టిపని చేస్తోన్న సందర్భాన జమీందారు మనుషులు పెట్టే హింసకు ఎదురు తిరగటంతో మొదటితరం ప్రారంభమై, పచ్చిపాల హన్మంతు, మల్‌దాదా, మాంధాత తరువాత రచయిత మల్లారెడ్డి, వారల సాహసగాథలు, ప్రజలను ఈ ఐదుతరాలు ఎట్లా ప్రేమించింది. బదులుగా ప్రజలు ఈ విప్లవనాయకులనుఎలా సమాదరించింది తెలుపుతాయీ కథలు. ఇవి యదార్థాలు. మొదటి పదికథలు కథకుడు మల్లారెడ్డి ముందు నాలుగు తరాల వివరాలు తెలుపుతాయి. మిగిలిన 15 కథలు, అనుబంధంగా ఇచ్చిన మరో రెండు కథల్లాంటి వ్యాసాలు పచ్చిపాల (గులాబీల) మల్లారెడ్డి విద్యాభ్యాసం ప్రజాపత్రికల నిర్వహణ ఒక అడ్వకేట్‌గా ఉద్యమకారుడిగా సర్పంచ్‌గా పేదల పక్షం నిలబడి, జనసేనయై, జనసేవకుడై న్యాయం పక్షం వహించి పోరాడిన వైనం తెలుపుతాయి. వీరి పూర్వీకుల కథలు చదువుతుంటే, పాఠకులకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 'ది రూట్స్'(తెలుగు సేత-ఏడుతరాలు) పుస్తకం గుర్తుకు వస్తుంది.

**(ఐదు తరాలు, రచన: గులాబీల మల్లారెడ్డి, వెల: రూ 150, ప్రతులకు: 3-1-706, వావిలాలపల్లి, కరీంనగర్)**

**- కూర చిదంబరం**

# 'కంచి పరమాచార్యపై చక్కటి కథనం'



ఆచార్యవతారలలో కాంచిపురయ తీర్థులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య స్వరూపంగా ఎన్నదగినది అంటారు. తమిళనాడులో విల్లుపురంలో సుబ్రహ్మణ్యశాస్త్రి, మహాలక్ష్మి దంపతులకు 1894 మే20 జన్మించిన బాలునికి స్వామినాథన్ అని పేరు పెట్టారు. స్వామినాథన్ తొలిగురువు తండ్రిగారే. 1905లో ఉపనయనం చేశారు. 4వ తరగతిలోనే షేక్స్‌పియర్ నాటకంలో ప్రిన్సు ఆర్థరు పాత్రపోషించి ప్రశంసలు అందుకొన్నారు. కంచిపీఠానికి 66వ పీఠాపతి తన వారసుడు స్వామినాథన్ అని తలచి 13సం॥ వయస్సుకే కంచికి పిలిపించుకొన్నారు. 1907 ఫిబ్రవరి 13న నిర్ణీత కార్యక్రమం పిమ్మట స్వామినాథన్ కంచిపీఠానికి 68వ ఆచార్యునిగా చంద్రశేఖరేంద్ర సరస్వతిగా అవతరించాడు. ఆయన విధించుకొన్న ఆశయ సాధనకు అవిశ్రాంత కృషి చేసిన ఆదర్శప్రాయుడైన సన్యాసి అన్నారు నాస్తికవాది అయిన తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి. ఈ పుస్తక రచయిత స్వామితో తన అనుభవాలూ రాశారు.

శ్యామశ్రీచరణ్, సామవేదం షణ్ముఖశర్మ, డా॥ప్రేమానందకుమార్ ల అభిప్రాయాలు ఈ పుస్తకం సారాన్ని తెల్పుతాయి. సనాతన హైందవ ధర్మాన్ని జగద్గురువు ఆదిశంకరులు దేశం అంతా సంచరించి ప్రజల్లో చైతన్యం తెచ్చే కృషి చేశారు. పీఠాలు నెలకొల్పారు. భారతదేశంలో 7 మోక్షపురాలలో 'కంచి ఒకటి' అందుకే కాళిదాసు 'నగరేషు కాంచి' అని కీర్తించారు. కంచిలో కామాక్షీదేవి ఆలయం నిర్మించారు. అద్వైతపీఠాధిపతి అయినప్పటికీ పరమాచార్య సర్వసమత్వాన్ని యావత్ ప్రపంచం ప్రశంసించింది. కంచి పీఠానికి ఎదురుగా మసీదును ఉంచాలన్న పరమాచార్యలోని పరమత సహనం కనిపిస్తుంది. పరమశివుడు ధరించిన

**(కంచి పరమాచార్య, రచన: 'శ్యామప్రియ' రావినూతల శ్రీరాములు, వెల:రూ 50, ప్రతులకు: ఎన్‌వీఎస్ శాంతారావు, రమణస్తాన్, శ్రీరాంనగర్, ఏ.టి.అగ్రహారం, గుంటూరు)**

**- తంగిరాల చక్రవర్తి**

# ఓ రైతు ఆదర్శం



అబ్దుల్ ఖాదర్ నడకట్టిన్‌ది కర్ణాటకలోని ధార్వాడ్ జిల్లా, అన్నిగెరి. వాసత్వంగా వచ్చిన పొలంలో నీటి వసతి లేదు. ఏ పంట వేసినా పోయేది. పండ్ల మొక్కలతోనూ నిరాశే ఎదురైంది. చింత మొక్కలకు పెద్దగా నీరు అవసరం లేదంటే వాటిని నాటారు. ముందు జాగ్రత్తగా పొలంలో నీటికుంటలు తవ్వించారు. 11 బోర్లు వేయిస్తే రెండుచోట్లే నీరు పడింది. చెరువు తవ్వించి అందులోకి ఆ నీరు పంపుతూ కొద్దిపాటి నీటితోనే ఆరు ఎకరాల్లో నాటిన 600 చింత మొక్కల్ని బతికించారు. ఆపైన మరో పది ఎకరాల్లో 1200 మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరిగాయి. చింత దిగుబడి అబ్దుల్‌కి కొత్త చింతని తెచ్చింది. పంటని నేరుగా అమ్మితే తనకేమీ మిగలదని జామ్, పచ్చడి తయారుచేయించి అమ్మేవారు. అందుకు కూలీలు అవసరమయ్యేవారు. పదో తరగతి చదివిన అబ్దుల్‌కి



చిన్నప్పట్నుంచీ యంత్రాలపైన ఆసక్తి ఉండేది. బోర్లు, ట్రాక్టర్లకు మరమ్మతులు చేస్తుండేవారు. ఆ పరిజ్ఞానంతోనే చింతపండు నుండి విత్తనాల్ని వేరుచేసే యంత్రాన్ని అభివృద్ధి చేయాలనుకున్నాడు. 'నీవల్ల అవుతుందా' అనేవారు తెలిసినవారంతా. మూడు లక్షలు ఖర్చు చేసి ఆరునెలలపాటు శ్రమించి ఓ యంత్రాన్ని అభివృద్ధి చేశారు. ఐదొందల మంది పనిని ఆ ఒక్క యంత్రం చేసేది. దాన్ని తన జీవితంలోనే అత్యంత కష్టమైన ఆవిష్కరణగా చెబుతారు అబ్దుల్. అలాగే చెట్టు నుంచి కాయల్ని తెంపడానికీ, పచ్చి చింతకాయల్ని ముక్కలుగా చేయడానికీ యంత్రాల్ని అభివృద్ధి చేశారు.



**మొదటి ఆవిష్కరణ**

'ఎడిసన్ నాకు స్ఫూర్తి' అని చెప్పే అబ్దుల్, చదువుకునే రోజుల్లో పొద్దున్నే నిద్రలేవలేకపోయేవారట. పరిష్కారంగా 'అలారం కీ'కి తాడుతో నీళ్ల సీసాని అనుసంధానించి అది మోగగానే నీళ్లు తనపై పడేలా ఏర్పాటు చేసుకున్నారు. 'అదే నా మొదటి ఆవిష్కరణ' అని నవ్వుతూ చెబుతారు అబ్దుల్. '19 ఏళ్లప్పుడు రైతుగా మారాక సాగు కష్టాలు అర్థమయ్యాయి. తోటి రైతులూ తమ సమస్యల్ని పంచుకునేవారు. వాటిని సులభంగా, తక్కువ ఖర్చులో పరిష్కరించే యంత్రాల గురించి ఆలోచించేవాణ్ణి' అని చెప్పే అబ్దుల్..ఓవైపు తన 'చింత సమస్యని పరిష్కరించుకుంటూనే..మరోవైపు సాగుకి అవసరమైన పరికరాల్నీ తెచ్చేవారు. 1975లోనే నేలని కాస్త లోతుగా దున్నే యంత్రాన్ని రూపొందించి రైతులకు అమ్మారు. సాధారణంగా రైతులు వాడే నాగలు కర్రు త్వరగా అరిగిపోతుంది. అలాకాకుండా నాలుగైదేళ్ల వరకూ అరగని కర్రుని తయారు చేశారు. మహారాష్ట్రకు చెందిన రైతుల కోరికమేరకు చెరకు నాటే యంత్రాన్ని రూపొందించారు. దీన్ని ట్రాక్టర్ వెనక అమర్చి విత్తనాలు నాటుకోవచ్చు.

ఆ యంత్రం వేల సంఖ్యలో..

అబ్దుల్ రూపొందించిన వాటిలో 5 ఇన్ 1 సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్‌కి మంచి గిరాకీ ఉంది. దీంతో భిన్న పరిమాణాల్లోని విత్తనాలు నాటొచ్చు. ఎరువులు వేయొచ్చు. విత్తనాలు వేశాక పై మట్టిని కప్పొచ్చు. రసాయనాల్ని పిచికారీ చేయొచ్చు. ఫలితంగా రైతుకు సమయం, డబ్బు, ఇంధనం ఆదా అవుతాయి. దీంతో 20 శాతం దిగబడి పెరిగిందంటారు రైతు శ్రీకాంత్‌జైన్. ఈ రకం యంత్రాలే 15వేలకుపైగా అమ్ముడయ్యాయి. మిరప, పత్తి, గోధుమ, జొన్న పంటలకు అనుకూలంగా నేలను మెత్తగా చదును చేసే రొటావేటర్‌నీ అభివృద్ధి చేశారు. దీంతో మిరప దిగుబడి మూడురెట్లు పెరిగిందంటారు రైతులు. పొలంలో తిరిగేటప్పుడు ట్రాక్టర్లు టైర్లు త్వరగా అరిగిపోతాయి. వీటికి బదులుగా ఇనపటైర్లను అభివృద్ధి చేశారు అబ్దుల్. 'నడకట్టిన్' పేరుతో ఈ యంత్రాల్ని అమ్ముతున్నారు. ప్రస్తుతం 12 రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. వీటిని స్వల్ప లాభాలకే అమ్ముతారు అబ్దుల్. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన రైతులు ఈయన దగ్గర ఎక్కువగా పరికరాల్ని కొంటారు. రెండు దశాబ్దాల నుంచి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, ధార్వాడ్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ, కర్ణాటక ప్రభుత్వం నుంచి పరిశోధనలకుగానూ అబ్దుల్‌కు ఆర్థిక తోడ్పాటూ అందుతోంది. తన సేవలకుగాను 2022లో పద్మశ్రీ అవార్డు అందుకున్న 69 ఏళ్ల అబ్దుల్ 'ఇది రైతు కోసం చేస్తున్న సేవ, వ్యాపారం కాదు. రైతు బాగుంటేనే దేశం బావుంటుంది. చిన్న ఆవిష్కరణలే సాగులో పెద్ద విప్లవం తెస్తాయి' అని గర్వంగా చెబుతారు.

# ఛలో ఫారిన్ విద్య



**గత** పదేళ్లనుంచి విదేశీవిద్యకు వెళ్తున్న భారతీయుల సంఖ్య పెరుగుతోంది. ఇంగ్లాండ్‌లో అడుగు పెడుతూనే 'ఎలాగో జ్ఞాపకం పెట్టుకొని కుడికాలే పెట్టాను. నిజానికి అదృష్టం బాగుంటే ఏ కాలు పెట్టినా ఇబ్బంది లేదు. బాగుండకపోతే ఏ కాలు ముందు పెట్టినా ఒక్కటే' అనుకుంటాడు పార్వతీశం. బారిష్టరు చదువు కోసం ఉన్న పల్లెటూరు నుంచి ఇంగ్లాండ్‌కు వెళ్లిన పార్వతీశం తెలియని భాష, మనుషులు, సంస్కృతుల వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతూ మనల్ని తెగ నవ్విస్తాడు. కాలం మారినంత మాత్రాన, చదువు కోసం వెళ్లినవారికి దేశం కాని దేశంలో సమస్యలు ఉండవని కాదు. అవి వేరేరకంగా ఉండవచ్చు. అవి ఏ రకంగా ఉన్నా సరే..యూత్ వాటిని లైట్‌గా తీసుకుంటుంది. విదేశీ యూనివర్శిటీలలో చదువుపై బోలెడు ఇష్టాన్ని చూపుతోంది..విదేశీ చదువు అనేది ఒకప్పుడు సంపన్న వర్గాల వారికి మాత్రమే పరిమితమైన విషయం. అయితే ఇప్పుడు దృశ్యం మారింది. ఆర్థికస్థాయి, చిన్నా, పెద్దాపట్టణాలు అనే తేడా లేకుండా ఎంతోమంది విద్యార్థులు విదేశాలకు వెళుతున్నారు. ఎనభైలలో ఫారిన్ యూనివర్సిటీ అంటే ఎక్కువమందికి అమెరికాలోని యూనివర్శిటీలు మాత్రమే. ఇప్పుడు అమెరికా, ఆస్ట్రేలియా, కెనడాలతోపాటు రిమోట్ ఈస్ట్ యూరోపియన్ దేశాలపై కూడా యువత ఆసక్తి ప్రదర్శిస్తోంది. 'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు రకరకాల సమాధానాలు వినిపిస్తాయి. అందులో ఒకటి 'పాఠ్యపుస్తకాలను, తరగతి గదినీ దాటి మన విద్యావ్యవస్థ బయటికి రాలేకపోతోంది. పాఠ్యాంశం యూత్‌కు దగ్గర కాలేకపోతోంది' బెంగళూరుకు చెందిన ఆద్యకు ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ అంటే ఆసక్తి. ఆ ఆసక్తి ఆమెను అమెరికాలోని 'జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' వరకు తీసుకువచ్చింది. 'ఈ యూనివర్శిటీ డిగ్రీ మాత్రమే ఇవ్వదు. ఎంతో అనుభవజ్ఞానాన్ని ఇస్తుంది' అంటుంది ఆద్య. ఫ్లెక్సిబుల్ కరికులమ్ నుంచి ప్రపంచంలోనే అత్యున్నతమైన బోధన సిబ్బంది వరకు ఆ యూనివర్శిటీ గురించి చెప్పుకోదగిన అంశాలను ప్రస్తావిస్తుంది ఆద్య. 'విద్యార్థులు తమను తాము వ్యక్తీకరించుకునే అనుభవ జ్ఞానాన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు ఇస్తాయి' అంటున్నారు ఓ యూనివర్శిటీ మాజీ వైస్‌ఛాన్సలర్. అయితే 'అత్యున్నత ప్రమాణాలతో కూడిన చదువు' మాత్రమే మన విద్యార్థులు దేశం దాటడానికి కారణం కావడం లేదు. 'భిన్నమైన సాంస్కృతిక వాతావరణంలో గడపడం, ఇతర దేశాల విద్యార్థులతో కలిసి చదువుకొనే అవకాశం దానికదే ఒక ఎడ్యుకేషన్' అనే అభిప్రాయం కూడా విదేశీ విశ్వవిద్యాలయాలపై ఆసక్తికి కారణం అవుతుంది. 'విదేశీ యూనివర్శిటీలలో చదువుకోవడం అనేది మన విద్యావ్యవస్థను తక్కువ చేయడం కాదు. మన పరిధిని విస్తృతం చేసుకోవడం మాత్రమే' అంటుంది పుణెకు చెందిన కావ్య. విదేశాలలో చదువు అనేది డిగ్రీలను మించినది. ఇది ఒకరకంగా 'సెల్ఫ్-జర్నీ' లాంటిది. నేటి యువత యూకేకు వెళ్లేందుకు కూడా ఆసక్తి చూపుతోంది. కారణం అక్కడి యూనివర్శిటీ ఫర్ ది క్రియేటివ్ ఆర్ట్స్‌కి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలో ప్రపంచంలో పెద్ద పేరు ఉండడం ఒక కారణం అయితే, సాంస్కృతిక వైవిధ్యం, గ్లోబల్ ఎక్స్‌పోజర్ అనేది రెండో కారణం. మూడోకారణం ఒకేరకమైన అభిరుచులు ఉన్న వారితో, సబ్జెక్ట్‌కు సంబంధించిన నిపుణులతో కలిసి నెట్‌వర్క్‌గా ఏర్పడే అవకాశం ఉండడం. మల్టీ కల్చరల్ యూనివర్శిటీలలో తమ పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. పక్కా ఫైనాన్స్ ప్లానింగ్, ఎడ్యుకేషన్ లోన్‌ల వల్ల పిల్లలను విదేశీ యూనివర్శిటీలలో చదివించడం చాలామంది పేరెంట్స్‌కు పెద్ద సమస్య కావడం లేదు. తల్లిదండ్రుల ఆసక్తిని గమనించి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లు ఎడ్యుకేషన్ లోన్స్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. మరోవైపు 'అబ్రాడ్ ఎడ్యుకేషన్ లోన్స్'కు బెస్ట్ ఎన్‌బీఎఫ్‌సీలు ఏమిటి? అని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు పేరెంట్స్, టెస్ట్-ప్రిపరేషన్, కంట్రీ, కోర్సు, యూనివర్శిటీ ఎంపిక, డాక్యుమెంటేషన్ ప్లానింగ్..మొదలైన వాటిలో స్టడీ అబ్రాడ్ కన్సల్టెన్సీలపై ఆధారపడుతోంది యూత్. అబ్రాడ్ ఎడ్యుకేషన్ అనగానే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ.. మొదలైన దేశాలు గుర్తుకు వస్తాయి తప్ప జపాన్ గుర్తుకు రావడం జరగదు. అయితే గణాంకాల ప్రకారం జపాన్ యూనివర్శిటీలలో చదివే మన విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. కొన్ని సంవత్సరాలు క్రితం జపాన్‌లోని 20 యూనివర్శిటీల ప్రతినిధులు ఢిల్లీ, పుణె, చెన్నైలలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు మంచి స్పందన లభించింది. ❑

కథ

# పొలంలో దాగిన నిధి

అవంతి రాజ్యంలో గుణనిధి అనేరైతు నివశిస్తుండేవాడు. విద్యపూర్తి చేసుకువచ్చిన తన ఇరువురు కుమారులు వ్యవసాయం పట్ల ఆసక్తి కనపరచకపోవడం గమనించిన గుణనిధి 'నాయనా మీ అమ్మతో కలసి నేను కాశీయాత్రకు వెళుతున్నాను. కాశీకిపోయినవాడు కాటికిపోయినట్లే అంటారు పెద్దలు. నేను తిరిగి రావడానికి సంవత్స ర కాలానికి పైగా పడుతుంది. కనుక మీరు మన వ్యవసాయ భూమిని సమంగా పంచుకుని దున్ని చదును చేయండి. అందులో నేను దాచిన నిధి ఎవరికి లభించినా సమంగా పంచుకొండి అది మీ జీవితకాలం అంతా సుఖంగా జీవించడానికి సరిపోతుంది. మీకు ఏదైనా సమస్య ఏర్పడితే మీ అమ్మ తమ్ముడు అయిన సుబ్బయ్య మామ సలహా తీసుకొండి'. అన్న గుణనిధి మరునాడు తన భార్యతో కాశీకి కాలినడకన బయలుదేరాడు.



తమకు వ్యవసాయంపట్ల ఆసక్తి లేకున్నా తమ తండ్రి పొలంలో నిధి దాచి ఉంచాను అని చెప్పడంతో అన్నదమ్ములు ఇరువురు వారం రోజులు కష్టపడి రెండు పర్యాయాలు పొలమంతా దున్నారు. అయినప్పటికీ వారికి పొలంలో ఎటువంటి నిధి లభించలేదు. అప్పుడు వారు నేరుగా తమ మేనమామ సుబ్బయ్యను కలిసి జరిగిన విషయం వివరించారు. 'అల్లుళ్ల మన పొలంలో నిధి ఎక్కడికీపోదు ముందు దున్నిన పొలంలో పంట వేయండి' అన్నాడు. 'మామయ్య మాకు వ్యవసాయం తెలియదు' అన్నారు అన్నదమ్ములు. తను దగ్గర ఉండి తన అల్లుళ్ల చేత శెనగపంట వేయించి ఎన్ని రోజులకు ఒకసారి నీళ్లు పెట్టాలి, కలుపు ఎలా తీయించాలో చెప్పి తన ఊరికి వెళ్లాడు సుబ్బయ్య. పంట బాగా పండటంతో ధనం బాగా వచ్చింది. గుణనిధి కుమారులకు మామయ్య సలహాతో వరి పంట వేసారు అన్నదమ్ములు. పంట బాగా పండటంతో చాలాధనం వారి చేతికి అందింది. అలా అన్నదమ్ములు వ్యవసాయం చేసి ధనవంతులయ్యారు. కానీ వారు పొలం దున్నుతున్న ప్రతిసారి నిధి దొరుకుతుందని ఎదురు చూడసాగారు. కొంతకాలానికి కాశీ వెళ్లిన తల్లి, తండ్రి తిరిగి రావడంతో అన్నదమ్ములు ఎంతో సంతోషించారు. ఒకరోజు సుబ్బయ్య మామయ్య తమ ఇంటికి రావడంతో 'మామయ్య ఇప్పటికీ పొలమంతా మూడుసార్లు దున్ని చదును చేసాము కాని మాకు పొలంలో దాగిన నిధి కనిపించలేదే అన్నారు. పక్కున నవ్విన మామయ్య 'అల్లుళ్ల మిమ్మల్ని శ్రమజీవులుగా మార్చడానికి నేను మీ తండ్రి ఆడిన నాటకం అది. సంవత్స రకాలంలో ఇంతధనం సంపాదించారంటే మీ జీవితకాలంలో ఎంతో సంపాదిస్తారు ఇలానే వ్యవసాయం చేసుకుని వృద్ధిలోనికి రండి' అని ఆశీర్వదించాడు సుబ్బయ్య మామ.

**- డా॥బెల్లంకొండ నాగేశ్వరరావు**

# తెలుగు బాలల వెలుగు

వార్త ఆదివారం

## బాలగేయం

### పిల్లలం



పిల్లలం, బడి పిల్లలం
చరిత్ర మార్చే పిడుగులం
అమ్మ చెబితే వింటాం
నాన్న అడుగులో
అడుగేస్తాం
గురువు చెబితే
ఆలకిస్తాం తల్లిదండ్రులకు
వన్నెతెస్తాం
దైవభక్తిని కలిగి ఉంటాం
దేశభక్తిని రుజువుచేస్తాం
దేశమాతను గౌరవిస్తాం
దేశ ప్రగతిని పెంచుతాం
దేశగతినే మార్చేస్తాం
పిల్లలం, బడి పిల్లలం
చరిత్ర మార్చే
పిడుగులం

**- కాయల నాగేంద్ర**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- కె.ఎస్.యశ్వంత్,** ఎమ్మిగనూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. రంగులను ఎలా గుర్తిస్తారు?**

**జవాబు: యశ్వంత్!** మల్లెపూలు తెల్లగా ఎందుకుంటాయి? మల్లెపూవు అన్ని రంగుల తరంగ దైర్ఘ్యాన్ని తనలో కలిపేసుకుంటుంది కాబట్టి. దాని మీద పడిన కాంతి పరావర్తనం చెంది తెల్లగా ఉన్నట్లు కనపడుతుంది. మరి మల్లెపూవు తెల్లగా వున్న విషయం మనకెలా తెలుస్తుంది? మన కళ్లు మన మెదడుకు చెబితే అప్పుడు మనకు తెలుస్తున్నది. అయితే ఈ విషయం చెప్పుకున్నంత సులభమైన ప్రక్రియ కాదు. మెదడులో జరిగే ఈ ప్రక్రియతో పాటు రంగులను గుర్తించడం మీద సంస్కృతి, భాష కూడా ప్రభావం చూపిస్తాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పపువా న్యూ గినియాలోని బెర్నిమో అనే ఆదిమ తెగకు చెందిన ప్రజల మీద పరిశోధనలు చేస్తుండగా ఈ విషయం బయట పడింది. వీరికి నీలం రంగుకు, పచ్చ రంగుకు మధ్య తేడా తెలియదు. అయితే పచ్చరంగులో రెండు రకాల ఛాయలను వీరు గుర్తించగలుగుతారు. పాశ్చాత్య దేశాల్లో ప్రజలు ఈ రంగులను గుర్తించటం కష్టం. ఈ విధంగా పాశ్చాత్య దేశాల్లో ప్రజల మీద కూడా ఇటువంటి ప్రయోగం చేశారు.

**- బి.పూనమ్,** హైదరాబాద్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. చీకట్లో మెరిసే స్టిక్కర్స్‌ను ఏవిధంగా తయారు చేస్తారు?**

**జవాబు: పూనమ్!** రేడియం మూలకంతో మెరిసే స్టిక్కర్లను తయారు చేస్తారు. ఈ రేడియం 'పిచ్ బ్లెండ్' అనే పదార్థం నుంచి రూపొందుతుంది. అధిక ఎలక్ట్రాన్ల కేంద్రక చర్యల కారణంగా రేడియం కాంతి రూపంలో ఎల్లవేళలా కొంతమేర శక్తిని విడుదల చేస్తుంటుంది. 'ఎలక్ట్రో టైపింగ్' ప్రక్రియ ద్వారా రేడియం స్టిక్కర్లు ప్రింట్ అవుతాయి. ఈ ప్రింటెడ్ స్టిక్కర్లు మాత్రం రేడియం మాదిరిగా ఎప్పుడూ మెరుస్తుండవు. వాటి మీద కాంతి కిరణాలు ప్రసరించినప్పుడే మెరుస్తాయి.



# టెర్రస్ గార్డెన్‌తో కోలుకుంటున్న శ్రీలంక



పర్యటక ప్రధాన ఆర్థికవనరుగా ఉన్న శ్రీలంక కొవిడ్‌తో దెబ్బతిని, కోలుకుంటున్న దశలో 2022లో మరో సంక్షోభం చుట్టుముట్టింది. ఆహారం, ఇంధన కొరతతో కూడిన పెద్ద ఆర్థిక సంక్షోభాన్ని కుదిపేసింది. రసాయనిక ఎరువుల ను దిగుమతి చేసుకోవడానికి డబ్బులేకపోయిం ది. ఈ సంక్షోభం తీవ్రత ఎంతంటే ప్రజలు తమ ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సి వచ్చింది. వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ అంచనా ప్రకారం సంక్షోభిత శ్రీలంకలో ప్రజలు భోజనాల సంఖ్యను 37 శాతం తగ్గించుకున్నారు. తినే ఆహారాన్ని 40 శాతం తగ్గించుకున్నారు. తక్కువ ఇష్టపడే ఆహారం తినటం 68 శాతం తగ్గించుకోవాల్సి వచ్చింది. బయటి నుంచి ఆహారో త్పత్తులు నగరానికి రావటం తగ్గిన ప్పుడు ఉన్న పరిమితులకు లోబడి నగరంలోనే కూరగాయలు, పండ్లు వంటివి పండించుకోవటం తప్ప వేరే మార్గం లేదు. దేశ రాజధాని కొలంబో అతిపెద్ద నగరమైన కొలంబో(అప్పటి) మేయర్ రోసీ సేననాయక్(మార్చి 19న ఆమె పదవీ కాలం ముగిసింది) ఈ దిశగా చురుగ్గా స్పందించారు. కొలంబో మునిసిపల్ కౌన్సిల్ (సిఎంసీ) మద్దతుతో నగరంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఆహార పంటలను పండించేలా చొరవ చూపారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కూరగాయలు, పండ్ల సాగు ప్రారంభమైంది. కొలంబో విస్తీర్ణం 37 చ.కి. మీ.లు జనాభా 6.26 లక్షలు(2022). నిజానికి ప్రజల స్థాయిలో టెర్రస్ కిచెన్ గార్డెనింగ్ ప్రయత్నాలకు కొలంబో గతం నుంచే పెట్టింది పేరు. అయితే పాలకులు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు.



కరోనాకు ఆర్థిక/ఆహార సంక్షోభం తోడైతే తప్ప కొలంబో మున్సిపల్ కౌన్సిల్(సీఎంసీ)కి, శ్రీలంక ప్రభుత్వానికి అర్బన్ అగ్రికల్చర్ ప్రాధాన్యం ఏమిటో తెలిసిరాలేదు. నగరంలో ఖాళీ స్థలాలు ఎక్కడ ఉంటే అక్కడ ఉన్నంతలో ఆకుకూరలు, కూరగాయల సాగుకు కౌన్సిల్ పచ్చజెండా చూపటమే కాదు.. మొదటి పెరటి తోట కొలంబో టౌన్ హాల్ చుట్టూ ఉన్న పచ్చిక బయలులోనే ఏర్పాటైంది. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత 30 సంవత్సరాల క్రితం క్యూబాలోని హవానాలో కూడా ఇలాగే జరిగింది.

వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యాలయం ఎదుట పచ్చికను తొలగించి కూరగాయ ల పంటల సాగుకు శ్రీకారం చుట్టిన సందర్భం అది. ఉపయోగించని ప్రతి అంగుళం ఖాళీ స్థలాల్లో ఇంటి పెరటి లో, బాల్కనీలలో, ఇంటి పైకప్పుల లోనూ కూరగాయలు పండించమని నివాసితులను, పాఠశాల విద్యార్థులను సీఎంసీ ప్రోత్సహించింది.

60 శాతంగా ఉన్న అల్పాదాయ వర్గాల ప్రజలకు అర్బన్ అగ్రికల్చర్ చాలా అవసరమని సీఎంసీ భావిస్తోంది. కొవిడ్ మహమ్మారికి ముందు నగరంలో కూరగాయల సాగు ఆవశ్యకతను సీఎంసీలో ఏ విభాగమూ గుర్తించలేదు. ఇప్పుడు వచ్చిన మార్పు గొప్పది. ఈ సానుకూల ప్రయత్నాలకు శ్రీలంక కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులందరూ పంటలు పండించడానికి శుక్రవారం ఇంట్లోనే ఉండేందుకు వీలు కల్పించింది. సేంద్రియ ఎరువుల ఉత్పత్తికి, నగర పరిసరాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను, వరిపొలాలు, ఖాళీ ప్రభుత్వ స్థలాల ను సాగు చేయడానికి సైన్యాన్ని కూడా వినియోగించారు. అన్నివర్గాల ప్రజలు ఆహారకొరతను దృష్టిలోపెట్టుకుని, కష్టపడి పండించుకునేందుకు పలు ప్రైవేటు సంస్థలు కూడా కదిలాయి. సెంట్రల్ కొలంబోలో పూర్తిగా వివిధ కూరగాయాల మొక్కలతో వీధులు కళకళలాడుతున్నాయి. దీంతో శ్రీలంక మెల్లగా కోలుకుంటున్నది.

బియ్యమూ మినప్పప్పూ రుబ్బుకుని, ఆ తడిపిండిని పులియబెట్టి, పులిసినపిండిని ఇడ్లీ అచ్చుల్లో ఉడకపెడితేకానీ మనకు ఇడ్లీలు రావు. కానీ, ఈ రెస్టారెంట్‌లో ఇడ్లీలు అలా చేయరు. తెల్లబియ్యంతో చేసిన అటుకుల్ని పిండిగా మార్చుకుంటారు. కొబ్బరిపాలు పోసి బాగా కలుపుతారు. ఆ పిండిని ఇడ్లీ అచ్చులపైన పోస్తారు. ఆ అచ్చుల్ని పొయ్యిమీద పెట్టక్కర్లేకుండా..ఓపది నిమిషాలు అలా ఉంచేస్తే చాలు..ఇడ్లీ రెడీ! పప్పులేనిదే, పోపువేయనిదే మనం సాంబార్‌ని ఊహించలేం. ఇక్కడేమో కొబ్బరిపాలు, పచ్చి పసుపుకొమ్ము, టమోటాలు, జీడిపప్పు పొడి, జీలకర్ర, తెల్లమిరియాలని మిక్సీపడితే



# పోషకాల రెస్టారెంట్

చాలు..రుచికరమైన సాంబార్ సిద్ధమైపోతుంది. మరి అన్నం మాటేమిటీ అంటారా..బియ్యానికి బదులు అటుకుల్నే నానబెట్టి వాటికి కొబ్బరితురుమునీ, జీలకర్రనీ చేర్చి రుచికరంగా మనముందు ఉంచుతారు. అవసరాన్నిబట్టి దీన్నే టమోటా రైస్‌గానూ, పులిహోరగానూ చేసిపెడతారు. అంతేకాదు, ఇక్కడ నూనె అక్కర్లేని రకరకాల వడలూ చేస్తున్నారు. ముందుగా బాదం, జీడిపప్పు, వేరుసెనగ పప్పుల్నీ తీసుకుంటారు. దానికి కొబ్బరి తురుము, జీలకర్ర,



మిరియాలూ, కొత్తిమీరల్ని చేరుస్తారు. ఆ మిశ్రమానికి అవసరమైతే గులాబీ రేకుల్నో, అరటిపువ్వునో కూడా కలిపి..మనం మామూలు వడల్ని నూనెలో వేయడానికి ముందు తడతాం కదా అలా 10 నిమిషాలపాటు తడుతూ ఉంటారు. తట్టేవాళ్ల చేతిలోని వేడికి కొబ్బరి తురుము నుంచి సన్నగా నూనె వచ్చి ఈ 'వడమిక్స్'ని అలముకుంటుంది. కరకరలు లేకపోతేనం కమ్మగా ఉంటుంది. ఇవేకాదు పచ్చి పసుపుకొమ్ము లడ్డూలు, బీరకాయ శాండ్‌విచ్‌లు, పొట్లకాయ కట్లెట్లు, తమలపాకు చట్నీలు, కరివేపాకు పచ్చళ్లు..ఇలా 2200 వెరైటీల్లో ఇక్కడ వంటకాలు చేస్తారు. ఉడికించడం ఉండదుకాబట్టి ఇవన్నీ పచ్చిగా మెండైన పోషకాలతో ఉంటాయి. నూనె అక్కర్లేదు కాబట్టి శరీరంలో హానికరమైన కొవ్వులు చేరతాయన్న భయమూ అక్కర్లేదు. మరి రుచి మాటో అంటారా? ఇక్కడ చేసే ఏ వంటకమూ పచ్చివాసన రాదు. అలా రాకుండా అన్ని కాయగూరల్నీ నిమ్మరసం, ఉప్పు కలిపిన నీటిలో నానబెడుతుంటారు. అలా వాటి సహజరుచీ, పోషకాలూ పోకుండా ఎవరైనా తినగలిగేలా చేస్తున్నారు. ఇంతకీ నిప్పు నూనె తగలకుండా ఇంత పచ్చిగానే ఇక్కడ ఎందుకు వడ్డిస్తున్నారూ అంటే 'మనం ఆరోగ్యం కోసమే' అంటారు 'నో ఆయిల్ నో బాయిల్' వ్యవస్థాపకుడు శివ.

**ప్రయోగాలతో సక్సెస్**

పండ్లు కాదు..వాటితోపాటూ పచ్చికాయగూరలూ తినడం చాలా మంచిదని చెబుతుంటారు వైద్యనిపుణులు. కానీ ఆ పచ్చివాసనని భరిస్తూ ఎలా తినడం? ఇదే ప్రశ్న చాలా రోజులుగా శివనీ వేధిస్తుండేదట. ఆయన ఇదివరకు ఓ ప్రయివేటు సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తుండేవాడు. తమిళనాట ప్రకృతి వ్యవసాయం కోసం పోరాడిన నమ్మాళ్వార్ అన్న శాస్త్రవేత్త బోధనలపైన అతనికి మంచి గురి ఉండేదట. ఆయనోసారి ఓ విందుకెళితే అక్కడ నూనె, నిప్పు వాడకుండా ఓ ఐదు వెరైటీల తో కూడిన భోజనం పెట్టారట. ఇదెలా చేయగలిగా రని అడిగితే, తమిళనాడులోని కొన్ని ప్రకృతి వ్యవ సాయ బృందాలు ఇలాంటి వంటకాలు తయారు చేస్తున్నట్లు చెప్పారట. ఆ బృందాల దగ్గరికి వెళ్లి ఓ 15 వెరైటీలు నేర్చుకున్నాడు శివ. వాటిపైన పదేళ్లపాటు ప్రయోగా లు చేస్తూ 2200 వంటకాలు తయారు చేశాడు. ఒక్క తమిళనాడు మాత్రమే కాకుండా దక్షిణాదిలోని పలు రాష్ట్రాలు తిరుగుతూ క్యాటరింగ్ విద్యార్థులకి దీన్ని నేర్పించ సాగాడు. ఈ వెరైటీ తరగతుల పైన మీడియా దృష్టి కూడా పడటంతో 250 మంది మహిళ తో మూడు నిమిషాల్లో 300 వంటకాలు చేయించి ప్రపంచ రికార్డు సాధించాడు. వాటిని సామాన్యులకీ చేరువ చేయాలన్న లక్ష్యంతోనే తన స్వస్థలం కోయంబత్తూరులో 'నో ఆయిల్ నో బాయిల్ రెస్టారెంట్' పెట్టి మూడేళ్లుగా విజయవంతంగా నడుపుతున్నాడు. మనదేశంలో మూడుపూటలా ఇలాంటి ఆహారాన్ని వడ్డిస్తున్న రెస్టారెంట్ ఇదొక్కటే మరి. ❐


కథ

# అందమైన అనుభూతి

తాళ్ళూరి లక్ష్మి

"ఏమోయ్ వసూ! రోటరీ క్లబ్బుదాకా వెళ్లి వస్తాను" గుమ్మం బయట చెప్పులేసుకుంటూ ఒక కేకేసి స్కూటర్ తీసుకుని బయటకు వెళ్లిపోయారు శ్రీవారు.

నేను రాత్రికి కావాల్సిన వంటా వార్పూ, మిగతా కార్యక్రమాలు చక్కబెట్టుకుని తీరిగ్గా రాములవారి కోవెలకు బయలుదేరాను. మా ఆయనకూ, నాకూ ఇదొక దైనందిన కార్యక్రమం అయిపోయింది. ఇద్దరం ఉద్యోగ విరమణ చేశాక అటు పల్లెటూరూ, ఇటు పట్టణం కాని ఈ ఊర్లో స్థిరపడ్డాం. దేశమంతా తిరిగాం మేం. పట్టణ జీవితమంటే మొహం మొత్తి, పల్లెటూరు వాసనలు ఇంకా పోని ఈ ఊరుని ఎంచుకుని రిటైర్మెంట్ తరువాత వచ్చిన డబ్బుతో ఇక్కడే అన్ని హంగులతో మాకిష్టమైన రీతిలో ఒక అందమైన ఇల్లు కట్టుకుని ఉంటున్నాం.



మా అబ్బాయీ, అమ్మాయీ ఇద్దరూ అమెరికాలోనే ఉంటున్నారు, వాళ్ల వాళ్ల కుటుంబాలతో కలిసి. ఇద్దరూ దాదాపు అక్కడే స్థిరపడిపోయారనవచ్చు. మమ్మల్ని కూడా అక్కడికే వచ్చేయమన్నారుగానీ మా ఆయన ససేమిరా అన్నారు.

"ఇంకా మా కాళ్లు, చేతులూ ఆడుతూనే ఉన్నాయి. కొన్నేళ్లపాటు ఈ పుట్టిన గడ్డ మీదే ఆనందంగా గడపనీయండి. మీరే యేడాదికోసారైనా పిల్లలతో వచ్చి మాతో ఇక్కడ గడపండి" అంటూ పిల్లలిద్దరికీ నచ్చచెప్పాం.

నేనూ, మా ఆయనా ఇద్దరమూ కేంద్ర ప్రభుత్వం నుంచి రిటైర్ అవడం వలన ఇద్దరి పెన్షన్లు కలిపి దాదాపు ఒక లకారం దాకా వస్తాయి. దానికితోడు ఆరోగ్య బీమా వంటి వసతులు కూడా ఉండడంతో ఏ చీకు చింతా లేకుండా సుఖంగా జీవించగలుగుతున్నాం. ఈ ఊరిలో ఇల్లు కట్టుకుని స్థిరపడ్డాక ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకున్నాం. మాకొచ్చే ఆదాయంలో ఎంతో కొంత సమాజ సేవ కోసం కేటాయించాలని. అనుకున్న విధంగా సమాజ సేవ చేస్తున్న ఎన్నో ప్రసిద్ధ సంస్థలకు ఉడతాభక్తిగా మేం ఇవ్వగలిగినంత విరాళాలు ఇస్తున్నాం. అలాగే మా ఆయన స్థానిక రోటరీ క్లబ్బులో చేరి వారు చేపట్టే సంఘసేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటూ ఆ సంస్థలో ఒక కీలక వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు.

ఉదయాన్నే లేచి నలభై నిమిషాల పాటు నడక, ఆ తరువాత ఒక పావుగంట యోగాసనాలు వెయ్యడంతో మా దినచర్య ప్రారంభమవుతుంది. ఆ తరువాత కాఫీ తాగుతూ ఇద్దరమూ చెరో న్యూస్ పేపరూ చదువుకుంటూ కూర్చుంటాం మరో గంటసేపు. పేపర్ చదవడం అయిపోగానే ఆయన వెనక పెరట్లో ఉన్న తోటపని చూసుకోవడం మొదలుపెడతారు. నేను వంటపనిలో నిమగ్నమైపోతాను. స్నానాలైపోగానే ఇద్దరం కలసి ఒక గంట పూజ చేసుకుంటాం. ఆ తరువాత ఆయన బయట పని వుంటే అది చేసుకుంటారు. లేదా తనకిష్టమైన సాహిత్య మథనం చేస్తుంటారు. మంచి పుస్తకాలు చదువుకుంటూనో లేదా పత్రికలకి పంపే వ్యాసాలూ గట్రా రాసుకొంటూనో.

నా మటుకు నేను నాకిష్టమైన సంగీత సాధన చేసుకుంటూ ఉంటాను. భోజనాల తరువాత కొద్దిసేపు విశ్రమించడం, మళ్లా సాయంత్రమయ్యేసరికి ఇలా బయటకు బయల్దేరడం. దాదాపు ప్రతిరోజూ ఇదే మా దినచర్య. ఈరోజు కూడా రాములవారి కోవెల చేరుకునేసరికి సంధ్యాసమయమైంది. దాదాపు ఎకరంన్నర స్థలంలో నిర్మించిన ఆలయమది. ఆలయ ప్రాంగణం చుట్టూరా పెద్ద పెద్ద చెట్లతో, ఒక పక్క పెద్ద కొలనుతో ఆ ప్రదేశమంతా ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

గుళ్లో రాములవారి దర్శనం చేసుకున్నాక కూచోడానికి గుడినానుకునే ఒక మండపం ఉంటుంది. అందులో ప్రతి సాయంత్రం సంగీత కచేరీలో, భక్తి ప్రవచనాలో, లేదా బృంద సంకీర్తనలో ఏవో ఒకటి జరుగుతూనే ఉంటాయి. దైవ దర్శనం అయ్యాక ఆ కార్యక్రమాలను చూసి ప్రసాదం తీసుకుని ఇంటికి వెళ్లడం నాకు అలవాటు.

నేను గుడికి వెళ్లేసరికి గుడి ప్రాంగణమంతా పిల్లా పాపలతో, పెద్దలతో, మహిళలతో ఎంతో సందడిగా ఉంది. నేను గుళ్లో దర్శనం చేసుకుని మండపంలో ఓ స్తంభానికానుకొని కూర్చున్నాను. ఇంకా కార్యక్రమమేది మొదలవపోవడం వలన చుట్టూరా ఉన్న మనుష్యులను చూస్తున్నాను. యథాలాపంగా ధ్వజస్థంభం వైపు చూస్తే ఆ అమ్మాయి మళ్లా అక్కడే కూర్చుని కనపడింది. ఇప్పటికి దాదాపు వారం రోజుల నించి ఆ అమ్మాయిని ప్రతిరోజూ అక్కడే కూర్చుని వుండగా చూస్తున్నాను. చేరడేసి కళ్లతో, పొడవాటి జడతో సన్నగా పొడుగ్గా వుండి బంగారు వన్నెలో మెరిసిపోతూ అచ్చం బాపూ బొమ్మని జ్ఞప్తికి తెస్తుంది. ఒడిలో ఒక చిన్న బాబుని పెట్టుకుని దైవ ప్రార్థన చేసుకుంటూ కూర్చుంటుంది. మధ్య, మధ్యలో ఆ అమ్మాయి పెద్ద పిల్లలనుకుంటా.. ఒక బాబూ, పాపా వచ్చి కాసేపు అమ్మతో మాట్లాడి తిరిగి ఆడుకోటానికి కొలను దగ్గరున్న పచ్చికలోకి వెళ్లిపోతారు.

ఆడుకోటానికి కొలను దగ్గరున్న పచ్చికలోకి వెళ్లిపోతారు. గుడిలో హారతి ఇవ్వగానే ప్రసాదం తీసుకుని పిల్లలతో కలిసి వెళ్లిపోతుంది.

ఆ అమ్మాయి పైన నాకంతగా ఆసక్తి కలగడానికి ముఖ్య కారణం ఆ అమ్మాయి కళ్లల్లో గూడు కట్టుకుని కనిపించే నైరాశ్యం. తను అంతమంది మధ్యలో కూర్చుని ఉన్నా ఆ కళ్లు ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నదానిలా శూన్యంలోకి చూస్తూ ఉంటాయి. చేతులకు మట్టిగాజులు, మెళ్లో పుస్తెలతాడు తప్పితే మరే ఆభరణం లేకుండా, సాదా నేత చీర కట్టుకుని దిగాలుగా కూర్చుని అశోకవనంలో సీతమ్మ వారిని తలపుకు తెస్తుంది. ఈ వారం రోజుల్లో ఆ అమ్మాయి ఎవరితోనూ మాట్లాడుతుండగా చూసింది లేదు. తన లోకంలో తనుంటూ సమయమవగానే వెళ్లిపోతుంది. పిల్లలతో మాటలాడేటప్పుడు కూడా ఆ పరధ్యానం అలాగే ఉంటుంది.

ఆ అమ్మాయిని మొదటిరోజు చూసినప్పటి నుంచి అనుకుంటూనే ఉన్నాను తనతో పరిచయం చేసుకుని, తన కష్టసుఖాలు తెలుసుకుని పాలుపంచుకోవాలి. కానీ ఏదో చెప్పలేని బిడియం ఆ అమ్మాయి ఏమైనా అనుకుంటుందేమోనని. అందుకే ప్రతీరోజూ ఆమెని కలవడాన్ని వాయిదా వేస్తూ వస్తున్నాను.

ఈరోజు ఎలాగైనా ఆమెతో పరిచయం చేసుకోవాలనుకున్నాను. ఆమెను కలుద్దామని అటువైపు నాలుగడుగులు వేశానో లేదో నా అదృష్టవశాత్తూ ఆ అమ్మాయి పిల్లల్లో ఒకరు విసిరిన బంతి నాకొచ్చి తగిలింది. అది చూసిన ఆ అమ్మాయి నా దగ్గరకొచ్చి క్షమాపణలు చెబుతూ పిల్లలని మందలించసాగింది "చూసుకుని బంతి విసరాలి, చూడండి ఆంటీకి ఎలా దెబ్బ తగిలిందో" అంటూ.

నేను ఆ అమ్మాయితో "మరేం ఫరవాలేదు, నాకేమీ దెబ్బ తగల్లేదు" అంటూ మెల్లగా మాటలు కలుపుతూ వెళ్లి తన పక్కనే కూర్చున్నాను. నన్ను నేను పరిచయం చేసుకున్నాక ఆ అమ్మాయి గురించిన వివరాలు తెలుసుకున్నాను. ఆ అమ్మాయి పేరు సునందట. భర్త ఒక ప్రైవేటు స్కూల్లో టీచర్ ఉద్యోగం చేస్తున్నాడట. ముగ్గురు పిల్లలు. బాబూ, పాపా స్కూలుకి వెళుతున్నారట. చంటివాడికి ఒక నెల క్రితమే సంవత్సరం నిండిందట. ఆ తరువాత ఇద్దరం ఏదో పిచ్చాపాటీ మాటలాడుతూ కూర్చున్నాం.

ఆ మర్నాడు నేను గుడికి వెళ్లి ఆ అమ్మాయిని కలవగానే నవ్వు ముఖంతో నన్ను పలకరించింది. ఆ విషయం, ఈ విషయం మాటలాడుకుంటూ ఉండగానే కొద్ది, కొద్దిగా చీకట్లు ముసురుకోసాగాయి. మాటల మధ్యలో అదను చూసుకొని ఆ అమ్మాయితో అన్నాను "చూడమ్మా సునందా! నీ తల్లిలాంటి దాన్ని. నేనిట్లా అడుగుతున్నానని ఏమీ అనుకోవద్దు. నీ కళ్లల్లో మెదులుతున్న దిగులుని చూసి అడగకుండా ఉండలేకపోతున్నాను. ఏదైనా తప్పుంటే క్షమించు. నువ్వు ఏమైనా కష్టాల్లో ఉన్నావా అమ్మా?"

ఆ కొద్ది మాటలే ఆ అమ్మాయి కళ్లల్లో నీళ్ల సుళ్లు తిరిగాయి. సానుభూతి కోసం ఎంతగా తపిస్తోందో ఏమో నా మాటలకు స్పందనగా చేతుల్లో ముఖం దాచుకుని నిశ్శబ్దంగా రోదించసాగింది. కొద్దిసేపటికి తనను తాను సంబాళించుకుని చెప్పింది.. తన చిన్నబాబుకి గుండె జబ్బుట. చిన్నప్పటి నుంచి ఎప్పుడూ నలతగా ఉంటుంటే పట్నంలో పెద్ద డాక్టర్‌కి చూపెట్టారట. ఆయన అన్ని పరీక్షలూ చేసి బాబుకి గుండెలో రంధ్రముందనీ, దానిని సరిచెయ్యటానికి సర్జరీ అవసరమౌతుం దని చెప్పాడట. సర్జరీకి కనీసం ఏడెనిమిది లక్షలు కావాల్సి వస్తుందన్నాడట. సర్జరీ కూడా ఒకటి రెండు నెలల్లో చేసేయాలన్నాడట.

తమ పరిస్థితి చూస్తే రోజువారీ ఖర్చులకే తడుముకోవాల్సి వస్తోంది, ఇంక సర్జరీ ఖర్చు ఎక్కడ భరించగలమని వాపోయింది. అప్పటికీ ఆమె భర్త ఎన్నో చోట్ల అప్పుకి ప్రయత్నం చేశాడట కానీ ఏదీ సఫలం కాలేదట. కనీసం తెల్ల కార్డువాళ్లమైనా మాకీ దుస్థితి ఉండేది కాదని ఎంతో బాధపడింది.




ఆమె పరిస్థితి చూసి నా గుండె తరుక్కుపోయింది. ఆమె ఒడిలో అమాయకంగా ఆడుకుంటున్న ఆ చిన్నారిని చూస్తుంటే మనసు చివుక్కుమంది. ఆమెను ఎలా అనునయించాలో తెలియలేదు. మెల్లగా గుండె దిటవు చేసుకుని "అమ్మా సునందా! అన్నింటికి పైన ఆ భగవంతుడు ఉన్నాడు. ఆయనను నమ్ముకుని ధైర్యంగా ఉండు. అన్నీ చక్కబడతాయి. నీ మంచితనమే నీకు శ్రీరామరక్ష" అన్నాను.

ప్రత్యుత్తరంగా సునంద ఒక నిర్జీవమైన నవ్వు నవ్వి "నేనిప్పుడు చేస్తున్నది, చేయగలిగినంది అదే అమ్మగారూ' అంది.

ఇంటికెళ్లాక ఆ రాత్రి నాకు జాగరణే అయ్యింది. మనసు మనసులో లేకుండా పోయింది. కళ్లు మూసుకున్నా, తెరిచినా సునంద విషణ్ణ వదనమే మనసులో మెదలసాగింది. రాత్రంతా కలత నిద్రతో గడిపి ఉదయాన్నే నిద్ర లేవగానే నా హృదయ భారాన్నంతా మా ఆయనతో పంచుకున్నాను.

నేను చెప్పినదంతా విని, ఆయన "దీనికింత బాధపడాలా వసూ! రాత్రే చెబితే అప్పుడే తగిన పరిష్కారం చెప్పేవాడినిగా!" అన్నారు.

"పరిష్కారమా?" ఆయనవైపు ప్రశ్నార్థకంగా చూశాను.

"ఔను.. పరిష్కారమే. ఆ అమ్మాయివాళ్లకి సర్జరీ చేయించగల స్థోమత లేకపోతే మనమే ఆ సర్జరీ చేయిద్దాం" అన్నారు.

"మనమా?" సందేహంగా అడిగాను.

"ఔను.. మనమే. మన భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న డబ్బేలాగూ ఉంది. దాన్ని సత్కార్యానికి వినియో గిద్దాం" అన్నారు. ఆయన మాటలకి నా హృదయం పులకరించిపోయింది. నా మనసులో మాటే ఆయన నోటివెంట వచ్చిందా అనిపించింది.

మంచి పనులను చేసేటప్పుడు ఏమాత్రం జాగు చెయ్యకూడదనుకుంటూ "అయితే ఈ రోజే సునందతో మాట్లాడి ఆ డాక్టర్ గురించిన విషయాలు తెలుసుకుని వస్తాను" అన్నాను.

అనుకున్నట్టే ఆ సాయంత్రం సునందతో మాట్లాడి పట్టణంలోని ఆ డాక్టర్ గురించి సమస్త సమాచారం సేకరించాను.

మర్నాడు నేనూ, మా ఆయనా కలిసి పట్టణం వెళ్లి ఆ డాక్టర్ని కలుసుకుని సునంద కొడుకు సర్జరీని గురించి అన్ని విషయాలూ మాట్లాడాం. సర్జరీకి అవసరమైన ఖర్చంతా మేమే భరిస్తామని, ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా సర్జరీకి ఏర్పాట్లు చెయ్యమని చెప్పాం.

మా ఆయన "డాక్టర్‌గారూ! మాదొక చిన్న విన్నపం. దయచేసి సర్జరీకి అవసరమైన ఖర్చంతా మేం భరిస్తున్నా మని ఆ బాబు కుటుంబానికిగానీ, మరెవరికీగానీ ఎటువంటి పరిస్థితుల లోనూ తెలియనివ్వవద్దు. అజ్ఞాతంగా వుండి సహాయం చెయ్యడంలోనే మాకు ఎంతో తృప్తి ఉంది" అన్నారు.

దానికి డాక్టర్‌గారు "సార్! నేనింత వరకు గోరంత చేసి కొండంత చెప్పుకునే వాళ్లనే చూశాను. కానీ మీలాంటి పుణ్యాత్ములని చూడలేదు. మీకు నా సంపూర్ణ సహకారం ఉంటుంది" అన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాక నేను, మా ఆయన సంతృప్తిగా ఇంటికి వచ్చేశాం. మర్నాడు సాయంత్రం నేను గుడికి వెళ్లేసరికి సునంద ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. నన్ను చూడగానే పరుగెత్తుకొచ్చి "అమ్మా! మీ నోటి చలవ వలన మా కష్టాలు గట్టెక్కే రోజు వస్తోందమ్మా" అంది.

నేనేమీ తెలియనట్లు ఏమయిందని అడిగాను. దానికామె "అమ్మా! ఈరోజు మా డాక్టర్‌గారు అర్జంటుగా రమ్మని ఫోను చేస్తే నేను, మా ఆయనా హాస్పిటలుకి వెళ్లాం. ఆయన ఎంతో తీపికబురు అందచేసారు. ఎవరో సంపన్నుడైన వ్యక్తి ఈరోజు హాస్పిటల్‌కి వచ్చి వాళ్ల అమ్మగారి పేరు మీద పది లక్షలు విరాళం ఇచ్చి ఆ డబ్బుని ఏవైనా అత్యవసరమైన చికిత్సలు చేయడానికి వినియోగించమని చెప్పాడట. హాస్పిటల్ వాళ్లు చర్చించుకున్నాక ఆ విరాళాన్ని మా బాబు సర్జరీకి ఉపయోగిద్దామని నిర్ణయించారట. ఆ విషయం చెప్పడానికే డాక్టర్‌గారు మమ్మల్ని పిలిచారు" అంది.

అది విని నేను "అమ్మా సునందా! చాలా సంతోషంగా ఉందమ్మా. ఇంక నువ్వేమీ దిగులు పడకు. అంతా సవ్యంగా జరిగి మీ బాబు సంపూర్ణ ఆరోగ్యవంతుడై వస్తాడు" అన్నాను.

సునంద తన ఆనందబాష్పాలు తుడుచుకుంటూ "అమ్మా! అంతా మీ కృప. ఏ శుభ ముహూర్తాన మీరు ఆ మంచి మాట అన్నారోగానీ అంతా మంచే జరుగుతోంది. మీరు బాబుని దీవించాక నాకింక ఏ భయం లేదు" అంది. మరో వారం రోజుల తరువాత డాక్టర్‌గారు ఫోను చేసి చెప్పేరు "బాబు సర్జరీ జయప్రదంగా జరిగిందని ఇంకో ఐదు రోజులు బాబుని హాస్పిటల్లో ఉంచుకుని ఇంటికి పంపిచేస్తామని.

ఈరోజే సునందావాళ్లు ఇంటికొచ్చే రోజు. మా ఆయనతో పొద్దుటే చెప్పాను ఈ రోజు సాయంత్రం సునందా వాళ్లింటికి వెళ్లి బాబుని చూసొద్దామనీ, మధ్యాహ్నమొకసారి బయటకు వెళ్లిబాబుకి ఏదైనా మంచి డ్రెస్ కొని తెమ్మని.

శ్రావణ శుక్రవారం కావటం వల్ల పొద్దుటే లేచి తలస్నానం చేసి, వంటపనంతా పూర్తి చేసి ఆయనతో పాటు పూజలో కూర్చున్నాను. పూజ పూర్తి కావస్తుండగా కాలింగ్ బెల్ మోగితే ఈ సమయంలో వచ్చేవాళ్లు ఎవరబ్బా అనుకుంటూ వీధిగుమ్మం దగ్గరికి వెళ్లి తలుపు తీశాను.

చూస్తే గుమ్మానికెదురుగా సునంద, చేతిలో బాబుతో. ఆమె పక్కనే ఆమె భర్తనుకుంటా.. అతనూ, ఆమె పెద్ద పిల్లలిద్దరూ. వాళ్ల వాలకం చూస్తే సరాసరి హాస్పిటల్నుండి మా ఇంటికే వచ్చేసినట్టున్నారు. అదే అడిగితే సునంద ఔనని తలూపింది. వెంటనే వాళ్లని గుమ్మం దగ్గరే ఆపి, ఇంట్లోకి వెళ్లి ఒక పళ్లెంలో ఎర్రనీళ్లు తీసుకొచ్చి, బాబుకి దిష్టి తీసి వాళ్లని ఇంట్లోకి ఆహ్వానించాను. వాళ్లని మా వారికి పరిచయం చేసి, కుశల ప్రశ్నలయ్యాక సునందతో "అమ్మా సునందా! ఈరోజు ఎంతో శుభప్రదమైన రోజు. బాబు పెద్ద గండం నుంచి బయట పడ్డాడు. ఇకనుంచి మీకంతా మంచే జరుగుతుందమ్మా" అన్నాను.

అంతవరకూ ఉగ్గబట్టుకుని కూర్చున్నట్టున్న సునంద నా మాటలతో ఒక్కసారి భోరుమని విలపిస్తూ బాబుని నా కాళ్ల దగ్గర పెట్టి తను వంటి నా కాళ్లు కళ్లకి అద్దుకుంది. అనుకోని ఆమె చర్యతో ఒక్కసారి అవాక్కయ్యాను.

"ఛ..ఛ.. ఇదేమి పని సునందా?" అంటూ ఆమెని వారించడానికి ప్రయత్నించాను. దానికి సునంద "అమ్మా! నన్ను ఆపడానికి ప్రయత్నించ కండి. అంత గొప్ప సహాయం చేసి ఇంత నిర్వికారంగా, నిరాడంబరంగా ఎలా ఉండగలుగుతున్నారమ్మా. మనుషుల్లో వెలిసిన దేవతామూర్తులు మీరిద్దరూ. ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగ లుగుతాం" అంటూ కళ్లనీరెట్టుకుంది.

ఆమె కళ్లల్లో మెదులుతున్న కృతజ్ఞత, ఆరాధనా భావం చూసి నా మనసు ఆనందంతో నిండిపోయింది. మానవ జన్మ ఎత్తాక ఇంకతన్నా సంతృప్తి ఏం కావాలి అనిపించింది. మా వారి పరిస్థితి కూడా నా లాగే ఉన్నట్టుంది. మాట మార్చడానికని సునంద భర్తని అడిగారు.. "ఈ విషయం మీకెవరు చెప్పారని?".

దానికతను హాస్పిటల్లో నర్సులెవరో ఈ విషయం మీద మాట్లాడుకుంటుంటే విని సునందకి సందేహమొచ్చి ఈరోజు వచ్చేసేటప్పుడు డాక్టర్ గారిని గట్టిగా నిలదీస్తే ఆయన గత్యంతరం లేని పరిస్థితిలో ఈ విషయం చెప్పారని చెప్పాడు. ఆ మాట విన్నాక సునందని ఇక పట్టలేకపోయాననీ, మొదట మీ దర్శనం చేసుకోనిదే ఇంటికి రానని భీష్మించుకుని కూర్చుందనీ చెప్పాడు.

ఆ తరువాత సునంద, ఆమె కుటుంబం మా ఇంట్లోనే భోజనాలు చేసి వాళ్లింటికి వెళ్లిపోయారు. మా దగ్గర ఉన్నంతసేపూ వాళ్లకి మమ్మల్ని పొగడడంతోనే సరిపోయింది. నా మటుకు నాకు సునంద కళ్లల్లో నైరాశ్యం మాయమై ఆనందం నాట్యం చేయడం చూస్తుంటే ఎంతో తృప్తిగా, హాయిగా అనిపించింది. ఆ రాత్రి మా ఆయనతో ఆ మాటే అన్నాను "మనం ఎన్నో సేవా సంస్థలకి ఎన్నో విరాళాలు ఇచ్చాం. అవి ఎంతవరకు సద్వినియోగం అవుతు న్నాయో కూడా మనకు తెలీదు. మనమటుకు మనం సమాజానికి మనకు చేతనయినంత సేవ చేస్తున్నాం అనుకుంటున్నాం. కానీ మనం అందించిన సహాయం ఒకరికి అంది వారి కష్టాలు కొంచెమైనా తొలగడం ప్రత్యక్షంగా చూడడం లోగల ఆనందం, సంతృప్తి, అనుభూతి వేరేదేని వలన రాదు" అన్నాను.

నాతో ఏకీభవిస్తూ మా ఆయన "ఔను.. సమాజానికి ఉపయోగపడే కొన్ని సహాయక చర్యలు ఏ ఒకరో, ఇద్దరో చేపట్టడం కుదరదు. అటువంటి వాటిని విరాళాలు ఇచ్చి పెద్ద, పెద్ద సంస్థల ద్వారానే సాధించగలుగుతాం.

అయితే కొన్ని సహాయాలు మనంతట మనమే చేయవచ్చు. ఇకమీదట అటువంటి కార్యక్రమాలను సాధ్యమైనంతవరకు మనంతట మనమే అర్హులైన వారిని గుర్తిస్తూ అవసరమైన సహాయాన్ని గోప్యంగా అందజేద్దాం" అన్నారు.

**"డాక్టర్‌గారూ! మాదొక చిన్న విన్నపం. సర్జరీకి అవసరమైన ఖర్చంతా మేం భరిస్తున్నా మని ఆ బాబు కుటుంబానికిగానీ, మరెవరికీగానీ ఎటువంటి పరిస్థితుల లోనూ తెలియనివ్వవద్దు. మాకు ఇలాగ అజ్ఞాతంగా వుండి సహాయం చెయ్యడంలోనే ఎంతో తృప్తి ఉంది" అన్నారు.**

# దేవుడెవరు.. దూతెవరు?

**ఆ ఊరికి కొత్తగా వచ్చాడా మనిషి. దాంతో ఆ ఊరి ప్రజలు అతన్ని చుట్టుముట్టి "నువ్వెవరు? ఎక్కడి నుంచి వస్తున్నావు? ఇంతకుముందెన్నడూ నిన్ను మేమెవరం చూడలేదు. ఎందుకిక్కడికి వచ్చావు?" అని ప్రశ్నల వర్షం కురిపించారు.**

**అప్పుడతను "నేను దేవలోకం నుంచి వస్తున్నాను" తాపీగా చెప్పాడు.**

**ఆ మాటకు అందరూ పగలబడి నవ్వారు.**

"నిన్నెవరు ఇక్కడికి పంపించారు?" అని మళ్లీ ప్రశ్నించారు జనం.

"దేవుడే నన్ను ఇక్కడికి పంపించాడు" అన్నాడతను ఏమాత్రం తడబడకుండా.

ఆ మాట విన్నవారందరూ ఇంతకుముందు కన్నా పెద్దగా నవ్వారు.

అతనికి మతిస్థిమితం లేదేమోనని తమలో తాము ఓ నిర్ణయానికి వచ్చి ఓ ఇద్దరు గట్టిగా అతనిని పట్టుకుని దగ్గరలో ఉన్న గుడికి తీసుకుపోయారు.

ఆ గుడి ఏమిటంటే మానసిక రోగులకు బాగు చేసే ప్రదేశమది. ఆ ఆవరణలోని ఓ స్తంభానికి అతనిని తాళ్లతో కట్టేశారు.

ఇప్పుడు అతను పెద్దగా నవ్వాడు.

అంతేతప్ప అతను తనను కట్టేశారేమిటని ఆందోళన చెందలేదు, కలవరపడలేదు.

"ఎందుకు నవ్వుతున్నావు?" అని వారు అడిగారు.

"సరైన జవాబు చెప్పకపోతే నీ సంగతులు అంతే" అన్నారు.

అప్పుడు అతను "నన్ను దేవుడు ఇక్కడకు పంపినప్పుడే చెప్పాడు. మీరెవరూ నన్ను నమ్మరని, నన్ను మతి చెడినవాడిగా అనుమానించి మీరు నన్ను బాగు చేయాలనుకుంటారు. ఇలా అంతా జరుగుతుందని, కనుక నువ్వేమీ భయపడక్కర్లేదని దేవుడు నాతో చెప్పాడని" అన్నాడు.

"ఇలా అంతా జరుగుతుందని అంటే ఎలా?" అని అడిగారు జనం.

"నిన్ను స్తంభానికి కడతారు. నిన్ను పిచ్చివాడని నవ్వుతారు. నీకేదో చికిత్స చేయాలనుకుంటారు. వీలుంటే నిన్ను కొట్టినా కొడతారు అని దేవుడు చెప్పాడ"న్నాడు.

"దేవుడు చెప్పినట్టే అంతా జరిగింది. ఇక మీరు నన్ను కొట్టడం ఒక్కటే మిగిలి ఉందన్నా"డు.

"నేను ఆ దేవుడి దూతను అనడానికి ఇంతకన్నా ఇంకేం రుజువు కావాలి?" అని వారిని ప్రశ్నించాడు.

ఆ మాటతో జనం ఆలోచనలో పడ్డారు.

"సరేగానీ, ఇంతకూ నువ్వు ఏం చెప్పాలనుకుంటున్నావు?" అని అడిగారు.

"నమ్మండి.. నేను ఒక దీర్ఘదర్శిని. దేవుడు నన్ను ఇక్కడికి పంపాడు. మీకు దారి చూపడమే నా కర్తవ్యం. అందుకే ఇక్కడికి వచ్చాను" అన్నాడు.

ఇప్పుడు ఇంకొక పెద్ద నవ్వు. ఆ శబ్దం ఎక్కడి నుంచి వస్తోందని అతను వెనక్కు తిరిగి చూశాడు.

ఆ నవ్వు శబ్దం కూడా ఆలయ మంటపంలో నుంచే వస్తోంది.

అక్కడ ఇంకొక మనిషి స్తంభానికి కట్టబడి ఉన్నాడు.

"నువ్వెందుకు నవ్వుతున్నావు?" అని దేవదూతనని చెప్పుకున్న మనిషి అడిగాడు.

"నువ్వు అబద్ధం చెప్తున్నావు. అందుకే నవ్వుతున్నాను" అన్నాడు ఆ మనిషి.

"ఏది అబద్ధం అంటున్నావు?" అని అడిగాడు.

"దేవుడు నిన్ను పంపాడన్నది అబద్ధం"

"అది నీకెలా తెలుసు?"

"అదా, నేను నిన్ను పంపనేలేదుగా" అన్నాడు.

తాను దేవదూతనని చెప్పుకున్న మనిషి కంగుతిన్నాడు.

అతను చెప్పాడు "నేనే దేవుడినని చెప్పుకుని ఇక్కడకు వచ్చాను. నన్ను నెల రోజులుగా ఇక్కడా కట్టి ఉంచారు" అని.

**"నువ్వు అబద్ధం చెప్తున్నావు. అందుకే నవ్వుతున్నాను" అన్నాడు ఆ మనిషి. "ఏది అబద్ధం అంటున్నావు?" అని అడిగాడు.**

"మిత్రులారా, నేనే దేవుడి దూతను అని కొందరు అంటున్నారు, నేనే దేవుడినని మరికొందరు తిరుగుతున్నారు. ఇంతకూ నిజమైన దేవుడు ఎక్కడ ఉన్నాడు?

ఓ మనిషి ఓ జ్ఞానిని వెతుక్కుంటూ వెళ్లాడు. నేను దేవుడిని కలవాలి" అన్నాడు.

ఆ జ్ఞాని ఇతని చెంప ఛెళ్లుమనిపించాడు.

అతను భయపడి పారిపోయాడు.


పక్కనున్నవారు జ్ఞానిని అడిగారు "అతనిని ఎందుకు కొట్టారు?" అని.

"అతను ఓ పిచ్చివాడు" అన్నాడు జ్ఞాని.

"అలాగా?"

"అవును. అతనినే అతను వెతుకుతున్నాడు" అని.

**- యామిజాల జగదీశ్**



తెలుగు సాహిత్యంలోని నాటక రచనను సాంఘిక దురాచారాలైన వేశ్యావృత్తి, వరకట్నం, మద్యపానంపై ధ్వజమెత్తి సంఘ సంస్కరణ మహోద్యమానికి, మహాకవి కాళ్లకూరి నారాయణరావు చిరస్మరణీయమైన సాహితీ చరిత్ర సృష్టించారు. ఆంగ్ల భాష సాహిత్య, సంస్కృతి ప్రభావంతో తెలుగు సాహిత్యం కొంగొత్త పుంతలు తొక్కుతున్న రోజులవి. ప్రాచీన

పెళ్లిళ్లలో వరకట్నం దురాచారపు వికృత స్వరూపం 'వరవిక్రయం' స్పష్టం చేస్తోంది. డబ్బుకు శరీరాన్ని అమ్ముకొనే మహిళను వెలయాలు అంటున్నట్టే, డబ్బుకు అమ్ముడు పోయే పెళ్లికొడుకును 'వెలమగడు' అనాలి కదా! అంటారు కాళ్ళకూరి ఈ నాటకంలో. మూడవ నాటకం 'మధుసేవ'. గాంధీజీ ప్రభావంతో మద్యపాన నిషేధాన్ని కోరుతూ కాళ్ళకూరి రాసిన నాటకం ఇది. మద్యపానం మనిషిని అన్ని రకాలుగా పతనం చేస్తుందనే సందేశాన్ని ఈ నాటకం అందిస్తోంది. ఈ మూడు నాటకాలు నాడూ నేడూ సమాజంలోని చెడును తూర్పారబట్టి సంస్కరణ కొరడా ఝుళిపించినవే. ఈ

మాధుర్యం, వేదికపై ప్రదర్శనకు అనుకూలమైన ప్రయోగ సౌలభ్యం కాళ్ళకూరి వారి రచనలలో ఉట్టిపడేవి. శతాబ్దం గడిచిపోయినా 'చింతామణి' నాటకంలో పద్యాలు శ్రోతలకు వీనుల విందుగా లయ శ్రావ్యత మరిచిపోలేనంతగా ఆకట్టుకొన్నాయి. పద్య నాటకాలు తెలుగు ప్రజా జీవితంలో భాగమై, తెలుగు సాహిత్యంలో ప్రతిభావంతమైన ఒరవడితో సాహితీవేత్తలు కలాలకు పదును పెట్టిన కాలం అది.

వావిలాల వాసుదేవశాస్త్రి రచన 'నందక రాజ్యం' తొలి స్వతంత్ర సాంఘిక నాటకంగా మొత్తం తేటగీతి పద్యాలలో

# కాళ్ళకూరి-నాటకత్రయం

భారతీయ అలంకారికులు సాహిత్య రూపాలలో నాటకం అత్యంత సుందరమైనదని ప్రశంసించటంతో చారిత్రక పౌరాణిక ఇతివృత్తాలతో రచనలు వెల్లివిరుస్తున్న రోజులలో కాళ్ళకూరి, సమాజహిత లక్ష్యంతో నాటకాన్ని మలుపు తిప్పారు.

పౌరాణికాలు, ప్రహసనాలు రాసిన కాళ్ళకూరి, 1908లో చిత్రాభ్యుదయం(చారిత్రకం), 1919లో పద్మవ్యూహం(పౌరాణికం) తర్వాత 1920లో చింతామణి, 1922లో వరవిక్రయం, 1926లో మధుసేవ, 1927లో సంసార నటన సాంఘిక నాటకాలతో సమాజ వైతాళికునిగా బహుముఖ ప్రజ్ఞావంతులైన నాటక కర్తగా కీర్తి ప్రతిష్ఠలు పొందారు. శూద్రకుడి మృచ్ఛకటికంలో వసంతసేన, గురజాడ 'కన్యాశుల్కం'లో మధురవాణి, శ్రీపాదవారి 'కలుపు మొక్కలు' కథలో కనిపించే దుగ్గిరాల శేషాచలం మొదలైన పాత్రలు వేశ్యలైనా, వాటి చిత్ర ప్రవృత్తులకు కాళ్ళకూరి వారి చింతామణికి పాత్ర చిత్రణ వేరుగా ఉంటుంది. వందేళ్ళు పైబడినా గురజాడవారి మధురవాణి, కాళ్ళకూరివారి 'చింతామణి' పాత్రలు నేటికీ వన్నె తగ్గని జనరంజకంగా విలసిల్లుతున్నాయి. తెలుగునాట




వందేళ్ల కాలంలో లక్షలాది మందిని విజ్ఞాన, వినోదాత్మకంగా అలరించిన ఈ నాటక త్రయానికి కాలదోషం లేదు. సమాజాన్ని పట్టిపీడించే వేశ్యాలోలత, వరకట్న దాహం, మద్యపాన వ్యసనంపై పోరాటం సాహిత్యాన్ని, సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసాయి. కాలానికి అతీతమైన కుటుంబ జీవన వ్యసన విషాద కథనాలివి.

1920-1930లలో చారిత్రక, జాతీయోద్యమ చైతన్య దిశలో తెలుగు సాహిత్యంలో నాటక రంగం గద్య, పద్యాత్మకంగా ఉగ్రరూతలూగించింది. సంఘ సంస్కరణాత్మకంగా పద్య నాటకాలు దురాచారాలు, మూఢ నమ్మకాలపై ధ్వజం ఎత్తాయి.

ఈ వరుసలో వచ్చిన నాటకాలలో 'కన్యాశుల్కం' మొదటి నాటకంగా చెప్పుకోవచ్చు. కేవలం వచన వ్యావహారిక రూపంలోనే కాకుండా గద్య పద్యాత్మకంగా వచ్చిన నాటకాలలో కాళ్ళకూరివారి 'వర విక్రయం', 'మధుసేవ', 'చింతామణి' వంటి నాటకాలు ప్రేక్షకులను అలరించాయి.

పాత్రకు తగ్గట్టుగా భాష, సరళ సుందరమై భావయుక్తంగా పద్య

రచించారు.

ఇది తెలుగులో మొట్టమొదటి కాల్పనిక సాంఘిక పద్య నాటకంగా గుర్తించబడుతోంది. తెలుగులో నాటక రచన 19వ శతాబ్దం ద్వితీయార్థంలో ప్రారంభమైనప్పటికీ, క్రమేపీ నైతిక విలువలతో కూడిన అభ్యుదయ సాహిత్యంగా ప్రధానంగా కాళ్ళకూరి వారి నాటకత్రయం, ప్రజల నాలుకలపై సజీవమైంది. గురజాడ, చిలకమర్తి, కాళ్ళకూరి వంటి వారి రచనలు మానవ జీవితంలో స్వార్థచింతన, సంకుచితత్వం, కాలం చెల్లిన దురాచార దుర్వ్యవస్థపై కొరడా ఝుళిపించాయి.

కాళ్ళకూరివారి నాటకత్రయంలోని పాత్రలు నేటికీ, శతాబ్ది కాలం గడిచినా సమాజాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాయి. ఈ దృశ్య కావ్యాలలో యోగినిగా మారిన చింతామణి, వరకట్న దురాచారానికి బలి అయిన కాళింది, మధుసేవలో కస్తూరి, నాటి సమాజంలోని మహిళల జీవితాలలో పురుషాధిక్యత, దురహంకార ధోరణులు, పతనానికి అనైతిక విశృంఖలతకు అద్దం పట్టాయి. తెలుగు సాహితీ సీమలో సాంఘిక నాటక ప్రక్రియను సామాన్య జన జీవన సంక్షేమం కోసం, సంస్కరణాయుత ఉత్తేజంతో ఉద్యమ సారథ్యానికి కలం పట్టిన కాళ్ళకూరి(1871-1927) చిరస్మరణీయులు.

- జయసూర్య

# చెప్పింది వినాల్సిందే!

సుబ్బారావు చిన్నగా విభూతి పెట్టుకుని కనిపించాడు.

"ఏమైంది?" అన్నాను. అదోలా మొహం పెట్టాడు. "గుడికెళ్లావా?"

"అవును. భయపడకు. నాకు ఎంత పెద్ద సమస్య వచ్చినా స్వామీజీల జోలికి పోను. కాకపోతే మంచి ట్రైంకి కనిపించావు. పెద్దగా సిద్ధాంతాలు చెప్పకుండా నాలుగు మంచి మాటలు చెప్పు".

"ఎవరికి?"

"ఇదిగో, ఈయనకే"

అప్పుడు చూసాను... పక్కనే ఓ కుర్రాడున్నాడు, పొట్టిగా ఉన్నాడు.

"ఏమైందీయనకి?" "భాబాగా మారాడు"

కిందా మీదా చూసాను. కాషాయం తొడగలేదు. పళ్లికిలిస్తున్నాడు.

"... అలా చూడకు. భాబా అంటే భార్యా బాధితుడు" "భా.." "అవును"

"ఇంతకీ బాధేంటి?" "ఆయన మాటల్లోనే విను"

........

హోటల్లో కూర్చున్నాం. "అన్నీ సమస్యలే!" కుర్రాడు చెప్పాడు. నిజమే. ఎన్నో సమస్యలుంటాయి. కానీ భార్య దగ్గర నుండి సమస్య వచ్చినప్పుడు మామూలుగా కనిపించేవన్నీ ఎందుకో సమస్యలుగా కనిపిస్తాయి. అక్కడున్న పవర్ అది".

"మచ్చుకు?"

"ఏంలేదు సార్, ఏమీ చెప్పలేను"

"చెప్పటం ఎందుకు?"

"భలేవారే! అలా వింటూ కూర్చుంటే ఎలాగండీ?"

"చెప్పక్కర్లేదని అర్థం కాదా?"

"పొరపాటుగా కూడా తెలీదు. నేను చిరునవ్వు నవ్వుతూ బతికేస్తున్నాను"

"ఇంతకీ ఏం చెబుతుంది?"

"ఇదిగో ఈ విభూతి దగ్గర నుండి భూతాల వరకూ ఏ సబ్జెక్ట్ అయినా తీసుకోండి. బడా బడా దంచేస్తుంది. అంతా గూగుల్ మహిమ. ఆ గూగుల్ సర్చ్‌లోకి వచ్చేముందే అందులోకి రాగలినవన్నీ చెప్పేస్తుంది. వేదాల దగ్గర నుండి నాదాల వరకు ఆమె సొత్తే".

"నీకు తెలియదు. అదంతా ట్రాష్ అనకపోయావా?" నవ్వాడు.

"సార్, దాని బదులు టేబిల్ మీద ఓ విషం నింపిన సీసా పెట్టి కళ్లు మూసుకోవటం మంచిది".

"దారుణంగా ఉందే?"

"అవునండీ. మనం ఏమైనా మాట్లాడితే నా తల్లిదండ్రులతో సహా ఆఖరుకి పెళ్లిమంత్రాలను చదివిన వాడిని కూడా అన్ని మాటలూ అనేస్తుంది. ఇది మనకెందుకు? మనకు తెలియదు. మన పని కాదు, అనే మాటే ఉండదండీ. అన్నీ మొబైల్‌లోనే ఉంటాయి. ఇంటికి వచ్చి చెప్పులు ఓ మూల పెడితే అలా కాదంటుంది".

"మరెలా?"

"రెండు సరిగ్గా, జోడీగా దక్షిణం వైపు చూస్తూ అందంగా అమర్చాలిట".

సుబ్బారావు ముసి ముసి నవ్వులు నవ్వాడు. కుర్రాడు కూడా నవ్వాడు. "నాకు తెలుసు.. మీరెందుకు నవ్వుతున్నారో"

"ఏంటో చెప్పు, సరదాగా నవ్వుకుందాం"

"ఏముంది? చెప్పుతో కొట్టుకోపోయినా అలా కాదు, ఇలా.. అంటుంది"

ఆలోచించాను. ఈ సమస్య ఇటీవల చాలా మంది జంటలలో చూస్తున్నాను. అన్నిటినీ విడిచిపెట్టి హాయిగా గుంపులలో లారీలలో ప్రయాణిస్తూ కాయకష్టం చేసుకుంటూ ఓ చెట్టుకి చీరె ముడి వేసి ఉయ్యాల కట్టి అందులో చంటిపిల్లను పడుకోపెట్టి రోజంతా శ్రమించి హాయిగా ఇంటికి వెళ్లి సుఖపడేవాళ్లు ఎంతో తెలివిగలవాళ్లు అనిపిస్తుంది.

"నా ఇష్టం. నాకు ఇవన్నీ చెప్పకు. నచ్చదు.. అని ఎప్పుడన్నా?"

"రెండు సార్లు" "గుడ్"

"గుడ్ కాదు, ఫుడ్ లేదు నాలుగు రోజులు!"

"అంటే?"

"అది మొదటిసారి. అలా అన్నందుకు ఇద్దరం ఏదీ తినలేదు"

"తరువాత?"

"రెండోసారి నేను వంట చెయ్యాల్సి వచ్చింది" "ఓ.. అసలు తట్టుకోవటమనేదే లేదు"

"మరి? అమెజాన్‌లో కొన్ని పుస్తకాలు తెప్పించి చదవమని నాకిచ్చేసింది. నేను అల్మారాలో పెట్టాను".

"అదీ నచ్చలేదా?"

"దానికి నన్ను ఏదో మానసిక పరమైన జబ్బుకు సంబంధించిన మాట అన్నది, అది నాకు నోరు తిరగటం లేదు" సుబ్బారావుకు అది నచ్చినట్లుంది.

"ఏంలేదు సార్, ఏమీ చెప్పలేను" "చెప్పటం ఎందుకు?" కాదా?"

"ఇది బాగుంది. ఆ మాట నిజమని చెప్పి ఈ గోల వినటం మానెయ్"

"అదీ చేసాను" "ఏమైంది?"

"ఆఫీసుకెళ్లాక పది మంది వచ్చి చుట్టూతా నిలుచున్నారు. నాకేదో అయిపోయిందనుకున్నారు. ఏమైంది? అని అడిగాను. అదే మాట నన్నడిగారు. అప్పుడు నా మొబైల్ చూస్తే అర్థమైంది. వాట్సాప్ గ్రూప్‌లో నా ఫొటో కనిపిస్తోంది. దాని కింద ఆ దారుణమైన జబ్బు తాలూకు వివరాలు, ఒక గూగుల్ లింకు దర్శనమిస్తున్నాయి"

"పోనీ.. ఫొటో బాగుందా?" అడిగాను.

"బాగుంది. ఎక్కడి నుండి సంపాదించిందో తెలియదు. సికింద్రాబాదు మొదటి ప్లాట్‌ఫార్మ్ మీద కుడి వైపు చివరికి దాదాపు పార్సిల్ ఆఫీసు దగ్గర ఓ బోర్డు మీద కొంత మంది దొంగల ఫొటోలుంటాయి. అలాంటి ఫొటో అది. కాకపోతే నాదే! ఇదీ కథ!"

........

ఇరవై నాలుగు గంటలు అన్నీ నాకే తెలుసు, లేదా నాకు తెలిసినవన్నీ అందరికీ తెలియవు అనుకోవటం, అలా అనటం, వినమనటం వాస్తవానికి ఒక జబ్బు. ఆ లక్షణాలు ఎంతో కొంత ఉన్నప్పుడు ఇలా స్మార్ట్‌ఫోనులు, ఇంటర్‌నెట్ వాడటం వలన ఈ జబ్బు చాలా ప్రబలమవుతుంది. మన ముందరున్నవారు ఎవరు అన్నది పూర్తిగా మరచిపోవటం జరుగుతుంది. వారితోగల అనుబంధం కూడా పూర్తిగా చెడిపోతోందన్న అవగాహన పూర్తిగా లోపిస్తుంది. ఒకరి జాతకంలో లగ్నాత్ పంచమంలో కుజుడు, శని, రాహువులు ఒంటరిగా లేదా అందరూ కలిసి ఉన్నప్పుడు ఎక్కువగా ఈ లక్షణాలు కనిపిస్తాయి. వీళ్ల సంబంధాలు పూర్తిగా చెడిపోతున్నాయి అని తెలుసుకున్నా ఏమాత్రం ఇబ్బంది పడరు.

**- వేదాంతం శ్రీపతిశర్మ**

# విమాన వేగాన్ని తలపిస్తున్న బుల్లెట్ రైళ్లు

**షేక్ అబ్దుల్ వాకీం జాని**

**మనిషి** జీవితంలో వేగం పెరిగిపోయింది. సామాన్యుడి నుండి కోట్లకు పడగలెత్తిన బడా బాబుల వరకు అందరూ అనునిత్యం తమ దైనందిన కార్యక్రమాలలో నిమగ్నమై పరుగులు తీస్తున్నారు. ఒక నగరం నుండి మరో నగరానికి, ఒక దేశం నుండి మరో దేశానికి ప్రయాణించడానికి ధనవంతులు విమానాలను ఆశ్రయిస్తుంటారు. అదే మధ్య తరగతివారు రైళ్లల్లో ప్రయాణిస్తుంటారు. ఒకప్పుడు ఆవిరితో నడిచే



చుకుచుకు రైళ్లు ఉండేవి. వాటి స్థానంలో డీజిల్ రైళ్లు, విద్యుచ్ఛక్తితో నడిచే రైళ్లు వచ్చేశాయి. 90 కి.మీ. వేగంతో వెళితేనే ఆహా, ఓహో అని అందరూ ప్రశంసించారు. ఇప్పుడు గంటకు వందల కి.మీ. వేగంతో పరుగులు తీసే రైళ్లు ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా అత్యంత వేగంగా పరుగులు తీసే బుల్లెట్ రైళ్లు కూడా వచ్చేశాయి. అందరికీ అందుబాటు చార్జీలతో 14 గంటలలో చేరవలసిన గమ్యాన్ని మూడున్నర గంటలలోనే చేరవేసే అతి వేగంగా పరుగులు తీసే రైళ్లు అందుబాటులోకి వచ్చేశాయి. విమాన వేగాన్ని తలపిస్తున్న అటువంటి బుల్లెట్ రైళ్లను మన దేశంలో కూడా ప్రవేశపెట్టడానికి శ్రీకారం చుడుతున్నారు. అందులో భాగంగానే వేగంగా ప్రయాణించే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించారు. ముమ్ముందు కొత్త, కొత్త బుల్లెట్ రైళ్లు మన దేశంలో ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**వందే భారత్ ఎక్స్‌ప్రెస్**

మన దేశంలో ప్రజా రవాణా వ్యవస్థలో రైల్వే శాఖకు మంచి పేరుంది. కొంత కాలం కిందట వందే భారత్ ఎక్స్‌ప్రెస్ పేరుతో అత్యంత వేగంగా పరుగులు తీసే రైలును ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇది బుల్లెట్ రైలు కాదు. గంటకు 190 కి.మీ. వేగంతో పరుగులు తీసేలా తయారు చేసినప్పటికీ కొన్ని కారణాల వల్ల ప్రస్తుతం 130 కి.మీ. వేగంతోనే ప్రయాణిస్తోందని అనేకమంది నిపుణులు పత్రికల్లో అనేకసార్లు ప్రకటించారు. ఇంత వేగంతో నడిచే రైలు మన దేశంలో ఇదే మొదటిది కావడం అందరూ సంతోషించదగిన విషయం. ఇంకా వేగంగా నడిచే రైళ్లను హైదరాబాద్ నుండి పూణే మధ్యలో ప్రారంభించాలనే ఆలోచన కూడా రైల్వే శాఖకు ఉంది. ఇటువంటి అనేక రైళ్లు పట్టాలు ఎక్కి పరుగులు తీసినట్లయితే వ్యాపారవేత్తలు, ఉద్యోగస్తులు ఇలా.. అన్ని రంగాల వారికి సమయం కలిసివస్తుంది. వందల కి.మీ. వేగంతో పరుగులు తీసే బుల్లెట్ రైళ్లు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. కొన్ని దేశాలలో అయితే బుల్లెట్ రైళ్లు తప్ప సాధారణ రైళ్లు కనిపించవు. వాటి గురించి తెలుసుకుంటే అనేక ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి.

**ఈటీఆర్-500:** ఇటలీకి చెందిన ఈ రైలు గంటకు 300 కి.మీ. వేగంతో ప్రయాణిస్తూ మిలాన్-రోమ్-నాపిల్స్ నగరాల మధ్య నడుస్తుంది.

**ఐసీఈ-3:** ఈ బుల్లెట్ రైలు జర్మనీ దేశానికి చెందినది. గంటకు 300 కి.మీ. వేగంతో మున్‌షెన్-లైప్‌జింగ్ నగరాలతో పాటు ఫ్రాంక్‌పుర్ట్-కొలిన్ మధ్య పరుగులు తీస్తూ సేవలు అందిస్తుంది.

**తాలీస్ టీజీవీ:** బెల్జియం దేశానికి చెందిన ఈ బుల్లెట్ రైలు గంటకు 300 కి.మీ. వేగంతో అక్కడి ప్రధాన నగరాలలో పరుగులు తీస్తూ సేవలు అందిస్తుంది.



**టీహెచ్ఎస్ఆర్ 700 టీ:** తైవాన్ దేశానికి చెందిన ఈ రైలు గంటకు 300 కి.మీ. వేగంతో తైపీ-కావోషింగ్ నగరాల మధ్య నడుస్తోంది.

**కేటీఎక్స్-శాంచియన్:** దక్షిణ కొరియాకు చెందిన ఈ రైలు గంటకు 305 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. సియోల్-బుసన్ నడుమ సేవలు అందిస్తుంది.

**అల్‌స్టోమ్ యూరో డూప్లెక్స్:** యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ఈ రైలు గంటకు



320 కి.మీ. వేగంతో పరుగులు తీస్తూ జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌తో సహా పలు ఐరోపా దేశాలలో సేవలు అందిస్తుంది.

**షింకాన్సెన్ హాయాబుసా:** జపాన్ దేశానికి చెందిన ఈ బుల్లెట్ రైలు గంటకు 320 కి.మీ. వేగంతో టోక్యో–ఆమోరి మధ్య నడుస్తుంది.

**సీమెన్స్ వెలరో:** స్పెయిన్ దేశానికి చెందిన ఈ రైలు గంటకు 350 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. స్పెయిన్‌లోని బార్సిలోనా నుండి మాడ్రిడ్ వరకు ఇది నడుస్తుంది.

**టాల్గో 350:** ఇది కూడా స్పెయిన్ దేశానికి చెందిన బుల్లెట్ రైలు. గంటకు 350 కి.మీ. వేగంతో పరుగులు తీస్తూ స్పెయిన్‌లోని మాడ్రిడ్ నుండి బార్సిలోనా వరకు నడుస్తుంది.

ఏజీవీ ఇటలో: ఇటలీ దేశానికి చెందిన ఈ రైలు గంటకు 360 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. నాపోలి నుండి మిలానో కారిడార్ నగరం వరకు దీని ప్రయాణం కొనసాగుతోంది.



**హార్మోని సీఆర్‌హెచ్ 380ఏ:** చైనాకు చెందిన ఈ రైలు గంటకు 380 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. బీజింగ్ నుండి షాంఘై మధ్య ఇది పరుగులు తీస్తుంది.

**షాంఘై మగ్లెవ్:** చైనా దేశంలో పరుగులు తీస్తున్న ఈ రైలు ప్రయాణికులు ఉంటే గంటకు 431 కి.మీ. వేగంతో దూసుకుపోతుంది. ప్రయాణికులు లేకుండా గంటకు 501 కి.మీ. వేగంతో ప్రయాణం చేస్తుంది. ఇది లాంగ్‌యాంగ్ రోడ్ నుండి షాంఘై పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం మధ్యన నడుస్తుంది. వాణిజ్య అవసరాల కోసం ఈ రైలును 2004లో ప్రారంభించారు. వీటితో పాటు ప్రపంచంలో అనేక దేశాలలో వాయువేగంతో పరుగులు తీసే రైళ్లను ప్రారంభించారు.

పోలాండ్‌లో పెండిలినో ఈడీ 250 అనే రైలు 200 కి.మీ, స్వీడన్‌లో ఎక్స్ సిరీస్ రైళ్లు 205 కి.మీ., పోర్చుగల్‌లో అల్ఫా పెండ్యులర్ రైలు 220 కి.మీ., వేగంతో, ఫిన్‌లాండ్‌లో ఆల్‌స్టోమ్ ఎస్ఎమ్ 3 అండ్ 6 పేరుగల రైలు గంటకు 220 కి.మీ. వేగంతో, నార్వేలోని బీఎం71 ఫ్లైటోగెట్‌తో పాటు ఎన్‌సీబీ క్లాస్ 73 రైళ్లు 220 కి.మీ, అమెరికాలోని అట్లాంటిక్ ఎసెలా ఎక్స్‌ప్రెస్ గంటకు 241 కి.మీ, హాంగ్‌కాంగ్‌కు చెందిన విబ్రాంట్ ఎక్స్‌ప్రెస్ గంటకు 250 కి.మీ, నెదర్లాండ్స్‌లో తాలీస్, యూరోస్టార్, ఐసీఈ బుల్లెట్ రైళ్లు గంటకు 300 కి.మీ. వేగంతో దూసుకుని పోతున్నాయి. విమాన వేగంతో పరుగులు తీసే బుల్లెట్ ట్రైన్‌లు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. జర్మనీలో ట్రాన్స్‌రాపిడ్07 అనే బుల్లెట్ రైలు మ్యాగ్నెటిక్ లివిటేషన్ సాయంతో అత్యంత వేగంగా ప్రయాణిస్తుంది. ఈ రైలును 1993లో ప్రయోగాత్మకంగా నడిపి పరిశీలించారు. ఆ సమయంలో ఈ రైలు 450 కి.మీ. వేగంతో పరుగులు తీసి పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. 167 అడుగుల పొడవైన ఈ రైలు 175 కి.మీ. దూరాన్ని కేవలం 53 నిమిషాలలోనే చేరుకుంటుంది. చైనాకు చెందిన సిఆర్‌హెచ్ 380 బిఎల్ అనే పేరుగల బుల్లెట్ రైలు ఇంజన్ నమూనా పాము ఆకారంలో ఉంటుంది. దీన్ని 2010లో ప్రారంభించారు. గాలితో పాటు అంతే వేగంగా పరుగులు తీస్తూ ఈ రైలు అందరినీ ఆశ్చర్యపరిచింది. గంటకు 487 కి.మీ. పరుగులు తీసి అందరినీ ఆకట్టుకుంది. అప్పటివరకు ఇంత వేగంగా పరుగులు తీసిన రైళ్లు లేవు. ఈ రైలు నిర్మాణ వ్యవస్థ ప్రమాదకరమైనదని కొందరు నిపుణులు సూచించడంతో కొంత కాలం దీన్ని నడపలేదు.

ఫ్రాన్స్‌లో నడిచే మరో బుల్లెట్ రైలు టిజీవి అట్లాంటిక్. ఈ రైలును ఫ్రెంచి మాన్స్టర్ అనే పేరుతో కూడా పిలుస్తుంటారు. ఈ రైలు 515 కి.మీ. అత్యధిక వేగంతో పరుగులు తీస్తుంది. 779 అడుగుల పొడవు, 445 టన్నుల బరువుతో ఈ బుల్లెట్ రైలును ఫ్రాన్స్‌కు చెందిన ఆల్‌స్టోమ్ అనే కంపెనీవారు రూపొందించారు. చైనా రాజధాని బీజింగ్ నుండి షాంఘై వరకు మధ్య దూరం 1300 కి.మీ. ఇంత దూరాన్ని అత్యంత వేగంగా పరుగులు తీసే ఇక్కడి బుల్లెట్ రైలు మూడున్నర గంటలలోపే గమ్యానికి చేరుస్తుంది. అనేక దేశాలలో బుల్లెట్ రైలులోని ప్రతి బోగీలో అయిదుగురు సిబ్బంది ఉంటారు. టి.సి, పోలీస్, ఆహారం అందించేవారు, రైలును శుభ్రపరిచేవారు తప్పనిసరిగా ఉంటారు. ప్రయాణికులకు ఎక్కడా అసౌకర్యం కలగదు.

## జపాన్‌లో బుల్లెట్ రైళ్ల వ్యవస్థ

బుల్లెట్ రైళ్ల వ్యవస్థ ప్రత్యేకమనే చెప్పాలి. వాటి పట్టాలు, రైలు మార్గం ప్రత్యేకంగా రూపొందిస్తారు. జపాన్ అనగానే మనకు బుల్లెట్ రైలు గుర్తుకు

(మిగతా 30వ పేజీలో)



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. రుణాలు తీరుస్తారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకండి. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. బంధు, మిత్రులతో మనస్పర్థలకు ఆస్కారం. విద్యార్థులకు పరీక్షల్లో విజయం లభిస్తుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. సంతానాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది.

## వృషభం



బంధు, మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఖర్చులు అధికంగా ఉంటాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు. శారీరక, మానసిక అలసటలు లోనవుతారు. కుటుంబంలో ఐకమత్యం లోపిస్తుంది. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి.

## మిథునం



ఆరోగ్య సమస్యలు ఉంటాయి. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వృథా ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. క్రయ-విక్రయాలు లాభదాయకం. స్నేహితులను ఎంచుకోవడంతో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. ఆర్థికంగా చెప్పుకోదగిన ఇబ్బందులేమీ ఉండవు.

## కర్కాటం



వ్యాపారులకు ఆశించిన లాభాలు ఉంటాయి. ఇతరులకు సామాన్యంగా ఉంటుంది. అకారణంగా ఆందోళన చెందుతారు. ఆరోగ్య సమస్యలు తీరుతాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. స్త్రీల వల్ల సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. వివాదాలకు దూరంగా ఉండడం మంచిది. ప్రతికూలతలు ఉన్నా పనులు పూర్తవుతాయి.

## సింహం



దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. వృత్తి ఉద్యోగులకు బాగుంటుంది. సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. ఉద్యోగులకు బాగుంటుంది. కోర్టు వ్యవహారాలు సానుకూలం. నూతన విషయాలు తెలుసుకుంటారు. వ్యతిరేకతలు ఎదురైనా ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

## కన్య



వృత్తి వ్యాపారులకు బాగుంటుంది. విదేశీ వస్తువులు కొనుగోలు చేస్తారు. కుటుంబంలో వివాదాలకు అవకాశం. వ్యాపారులకు రుణాలు మంజూరవుతాయి. స్త్రీల వల్ల సమస్యలు రావొచ్చు. ప్రత్యర్థులు సమస్యలు సృష్టించినా చాకచక్యంతో ఎదుర్కొంటారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి.

## తుల



వృత్తి రంగాల్లో వున్నవారికి ఆశించిన లాభాలు ఉంటాయి. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. కుటుంబంలో వివాదాలకు ఆస్కారం. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. స్త్రీల వల్ల సమస్యలు ఎదురయ్యే సూచనలున్నాయి. వృథా వాదోపవాదాలతో కాలక్షేపం చేస్తారు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు. అనుకోని సమస్యలు ఎదురవుతాయి.

## వృశ్చికం



ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. అనుకున్నది సాధించలేకపోవచ్చు. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. వారాంతంలో రుణాలు చేతికంది వస్తాయి. వృత్తి వ్యాపారులకు ఆశాజనకంగా ఉంటుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. ఆదాయానికి తగిన ఖర్చులు ఉంటాయి. క్రయ-విక్రయాలు యథాతథంగా ఉంటాయి. స్త్రీలకు శుభ యోగం. సంతానాభివృద్ధి గురించి ఆలోచిస్తారు.

## ధనుస్సు



దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయులను కలుసుకుంటారు. తీర్థ యాత్రలు చేస్తారు. దీర్ఘకాలిక రుణాలు వారాంతంలో రుణాలు తీరుస్తారు. అకారణంగా మనోవేదనకు లోనవుతారు. వృత్తి ఉద్యోగాల్లో వున్నవారికి బాగుంటుంది. ఆర్థికాభివృద్ధి సంతృప్తినిస్తుంది. ఉద్యోగులకు ఉన్నతాధికారుల ప్రశంసలు లభిస్తాయి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు.

## మకరం



మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. ఆదాయానికి తగిన ఖర్చులు ఉంటాయి. క్రయ-విక్రయాలు బాగుంటాయి. వృత్తి వ్యాపారులకు ఆశించిన ఫలితాలు ఉంటాయి. దేశాంతర ప్రయాణం చేస్తారు. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. వాహన యోగం. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలు సానుకూలం. కుటుంబ సమస్యలు పరిష్కారమై ప్రశాంతత ఏర్పడుతుంది.

## కుంభం



సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. ఆర్థికంగా ఆశించిన ఫలితాలు వారాంతంలో పొందుతారు. ఊహించని వార్తలు వింటారు, సంయమనం పాటించండి. దూర ప్రాంత ప్రయాణం చేస్తారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ధర్మ రక్షణకై పాటుపడతారు. వృథా కాలక్షేపం చేస్తారు. ఉద్యోగులకు సమస్యలుంటాయి.

## మీనం



స్వల్ప ధన నష్ట సూచనలున్నాయి. సంతానాభివృద్ధి గురించి చర్చిస్తారు. వృత్తి వ్యాపారులకు ఆశించిన లాభాలు ఉండకపోవచ్చు. వృథా ఖర్చులు ఉంటాయి. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. విద్యార్థులకు పరీక్షల్లో అనూహ్య విజయం లభిస్తుంది. విందు-వినోదాల్లో పాల్గొంటారు.

# ఉత్తరం వైపు బావి ఉండవచ్చా?


వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458


## ఉత్తర బావి(నీచ స్థానం) -మిశ్రమం

ఉత్తర మధ్య భాగంలో కాక వాయవ్యం వైపు అంటే నీచ స్థానం వైపు ఇంటి మూలపోటు రాకుండా బావి తవ్వినపటికీ సత్ఫలితాలుగానీ, దుష్ఫలితాలుగానీ తీవ్రంగా ఉండవు. **శుభా శుభ ఫలితాలు:** మిశ్రమ ఫలితాలు.

## Northern Well(Low-grade location)-Mixed

If a well is dug in the middle of the North or in the North-West(Low-grade location) avoiding strike with the corner of the house, the effects are neither significantly harmful nor gainful.

**Likely Result:** Mixed results.

## ఉత్తర వాయవ్య బావిపోటు-అశుభం

ఇంటికి ఉత్తర వాయవ్యంలో బావి కానీ, బావిపోటుగానీ ఉండకూడదు. ఇంటి పశ్చిమ పారు నుండి ఉత్తర ప్రహారీగోడ వైపు తాడు పట్టి లాగినప్పుడు మధ్యలో బావి వచ్చినట్లయితే దానిని ఉత్తర వాయవ్య బావిపోటుగా గుర్తించాలి. **శుభాశుభ ఫలితాలు:** మానసిక రుగ్మతలు, ధన నాశనం.

## North North-Western Well(Potu)-unvafourable

North North-West well or flaw of strike does not gives fovourable results. If a string, held straight from the Western boundary of the house to the Northern compound wall, encounters a well then it should be considered as a pot of the North North -West well.

**Likely Result:** Monetary losses and likelihood of mental illness.

## ఉత్తర వాయవ్య బావి-అశుభం

ఇంటి పోటు ఉన్నా, లేకున్నా ఉత్తర వాయవ్యంలో బావి ఉన్నట్లయితే మంచి ఫలితాలుండవు. ఇటువంటి బావులకు చుట్టూ వుండే నేల పశ్చిమ/దక్షిణాలకు పల్లం వున్నట్లయితే చెడు ఫలితాలు తీవ్రతరం అవుతాయి. **శుభా శుభ ఫలితాలు:** వ్యాజ్యములు, వ్యసనములు.


## North North-Western Well-unfavourable

Whether there is a strike or not, if there is a well is in the North North-West, there are no favourable effects. If the ground surrounding the well is at lower level in the West or South, the fovourable effects get increased.

**Likely Result:** Debts. Bad habits.

## వాయవ్య బావి-అశుభం

పూర్తి వాయవ్య మూలలో బావి ఉండకూడదు. ఇంటి వాయవ్య మూల నుండిగానీ, స్థలం ఆగ్నేయ మూల నుండిగానీ తాడు పట్టి స్థలం వాయవ్య మూలకు లాగినప్పుడు బావి మీదుగా వస్తుంది. అప్పుడు ఇంటికి బావిపోటు దోషం ఏర్పడుతుంది. **శుభా శుభ ఫలితాలు:** మనస్తాపం, అనారోగ్యం, వ్యాజ్యాలు, ధన వ్యయం.



## North-Western Well-unfavorable

There should not be a well wholly in the North-West corner. When a string is held straight from either the North-West corner of the house or from the South-East of the plot to the North-West of the plot, it runs over the well. In such case the house is acquires the flaw of strike of the well.

**Likely Result:** Mental worries, ill-health, debts, heavy expenditures.

## పశ్చిమ వాయవ్య బావి-అశుభం

ఇంటి నుండి ఎటువంటి పోటు లేకున్నపటికీ పశ్చిమ వాయవ్యంలో బావి ఉండటం సత్ఫలితాలు ఇవ్వదు. ఇటువంటి బావులకు చుట్టూ వుండే నేల పశ్చిమ/దక్షిణాలకు పల్లం వున్నట్లయితే చెడు ఫలితాలు తీవ్రతరం అవుతాయి. **శుభా శుభ ఫలితాలు:** ఇంటి యజమాని దేశదిమ్మరి అయ్యే అవకాశం ఉంది. వ్యాజ్యాలు, ధన నష్టం, మానసిక రుగ్మతలు.

## West North-Western Well-unfaourable

When the house does not have any kind of strike a well in the West North-West gives unfavourable result. If the ground surrounding the well is at lower level in the West or South, the unfavourable effects get increased.

**Likely Result:** Head of the family likely to become nomadic, debts, heavy expenditures and liked of mental illness.

# విమాన వేగాన్ని తలపిస్తున్న బుల్లెట్ రైళ్లు

**(27వ పేజీ తరువాయి)**

వస్తుంది. సురక్షితంగా ప్రయాణించడం సరైన సమయానికి గమ్య స్థానాలకు చేర్చడం వీటి ప్రత్యేకత. అధిక వేగంగా ప్రయాణించినప్పటికీ ఈ బుల్లెట్ రైళ్లు ప్రమాదానికి లోను కావు. జపాన్‌లో ఇప్పటివరకు సాంకేతిక వైఫల్యాలతో వేళ్లపై లెక్కించదగిన రైలు ప్రమాదాలు మాత్రమే జరిగాయంటే అక్కడి వ్యవస్థల పనితీరు సునాయాసంగా అర్థమౌతుంది. పొరపాటున రైలు ప్రమాదం జరిగినపటికీ ప్రాణనష్టం అంతగా జరగదంటే ఆశ్చర్యం కలగక మానదు. గత 60 ఏళ్లలో ఈ బుల్లెట్ ట్రైన్ల వల్ల ప్రాణనష్టం జరగకపోవడం వీటి సామర్థ్యాన్ని తెలుపుతోంది. ఇప్పటివరకు రెండు సార్లు ఈ బుల్లెట్ రైళ్ల పట్టాలు తప్పాయి. అయితే వాటికి కారణం మాత్రం సాంకేతిక వైఫల్యం కాదు. ఈ రెండు ఘటనల్లోనూ ఎవరూ చనిపోలేదు. జపాన్‌వారు వేగంగా పరుగులు తీసే ఒక బుల్లెట్ రైలును రూపొందించే క్రమంలో ఎంఎల్ 500 అనే రైలును 1975లో రూపొందించారు. తొలుత ఈ రైలును ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకే రూపొందించారు. 13.3 మీటర్ల పొడవైన ఈ బుల్లెట రైలును జపాన్‌లోని మియాగ్‌లీవ్ రైలు మార్గంలో నడపగా గంటకు 517 కి.మీ. ప్రయాణించింది.

ఆ తరువాతి కాలంలో ఈ రైలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని జపాన్‌లో గంటకు 600 కి.మీ. వేగంగా నడిచే బుల్లెట్ రైళ్లను ప్రారంభించారు. కొన్ని దేశాలలో బుల్లెట్ రైళ్ల పట్టాలపై పరుగులు తీస్తే, మరికొన్ని దేశాలలో సాధారణ రైలు మార్గాలకు సంబంధం లేకుండా ప్రత్యేకంగా నిర్మించిన ఫ్లైఓవర్‌లపై ప్రయాణిస్తాయి. అత్యాధునిక అయస్కాంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడా ఇవి పనిచేస్తాయి. ఇంత వేగంగా వెళ్లే ఈ బుల్లెట్ రైళ్లు ఫ్లైఓవర్లపై పరుగులు తీయడం వల్ల గేట్లు వేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం వంటి సమస్య ఉండదు. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలలో సాధారణ రైళ్లు కనిపించవు. అన్నీ బుల్లెట్ ట్రైన్‌లే నడుస్తున్నాయి. జపాన్‌లో ఈ బుల్లెట్ రైళ్లను 1964 అక్టోబరు 1న టోక్యో ఒలింపిక్స్‌కు 9 రోజుల ముందు ప్రారంభించారు. తొలిసారి టోక్యో నుంచి ఒసాకాకు ప్రయాణాలు సాగించాయి. ప్రస్తుతం జపాన్‌లో 2,700 కి.మీ.కు పైగా ఈ బుల్లెట్ రైళ్లు విస్తరించాయి. బుల్లెట్ రైలును జపాన్‌లో షింకాన్‌సెన్ అని అంటారు. జపనీస్ భాషలో షింకాన్‌సెన్ అంటే కొత్త ట్రంక్‌లైన్ అని అర్థం వస్తుంది. ప్రారంభించినపుడు ఈ బుల్లెట్ రైలు గంటకు 210 కి.మీ. వేగంతో ప్రయాణించేది. తర్వాత ఎన్నో మార్పులు, అయస్కాంత సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో మరింత వేగం పుంజుకుంది. ప్రస్తుతం ఈ బుల్లెట్ రైళ్లు గంటకు 500 కి.మీ. పైబడి వేగంతో పట్టాలపై పరుగులు పెడుతున్నాయి. జపాన్‌లో ప్రతిరోజు లక్షల మంది ఈ బుల్లెట్ రైళ్లలోనే ప్రయాణం చేస్తున్నారు.



అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం జపాన్ అంటేనే తరచూ భూకంపాలు సంభవించే దేశం. దీంతో ఈ భూకంపాలను కూడా తట్టకునేలా ఇంజినీర్లు ఈ బుల్లెట్ రైళ్లను తయారు చేశారు. భూకంప కేంద్రం నుంచి ప్రకంపనలు ప్రారంభం కాగానే ఈ బుల్లెట్ రైలు వ్యవస్థ తక్షణం స్పందిస్తుంది. వెంటనే రైళ్లకు కరెంటును ఆపేస్తుంది. దీంతో బుల్లెట్ రైలులో ఉండే టెక్నాలజీ రైలును నిలిపివేస్తుంది. ఆ కారణంగా రైలు దెబ్బ తినకుండా ప్రయాణికుల ప్రయాణికుల ప్రాణాలు పోకుండా ఉంచేందుకు సహాయపడుతుంది. ఈ బుల్లెట్ రైళ్లల్లో అత్యాధునిక సెన్సార్లు ఉంటాయి. పట్టాల ఉష్ణోగ్రత, వర్షాలు పడటాన్ని పరిశీలిస్తుంది. రైలుకు వ్యతిరేకంగా గాలి సెకనుకు 30 మీటర్ల కంటే ఎక్కువ వేగంతో వీస్తే బుల్లెట్ రైలు దానికదే ఆగిపోతుంది.


అత్యుత్తమ శిక్షణ పొందిన డ్రైవర్లు బుల్లెట్ రైలును నడిపే వారికి మొత్తం సాంకేతిక వ్యవస్థ అందుబాటులో ఉంటుంది. ఏది జరిగినా డ్రైవర్‌కు క్షణాల్లో తెలిసిపోతుంది. అత్యాధునికి సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి అవాంతరాలు, అడ్డంకులు ఎదురైనా డ్రైవర్ మొత్తం నియంత్రించేలా వ్యవస్థలు ఉంటాయి. బుల్లెట్ రైళ్లలో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎదురెదురుగా రెండు రైళ్లు వచ్చినా ఢీకొట్టకుండా ఉండేలా చూస్తుంది. దీని కోసం ప్రత్యేకంగా హై స్పీడ్ ట్రాక్‌లను నిర్మించారు. బుల్లెట్ రైళ్లు ప్రయాణించే మార్గాల్లో ఎలాంటి లెవల్ క్రాసింగ్‌లు ఉండకుండా జాగ్రత్త పడ్డారు. ఆటోమేటిక్ ట్రైన్ కంట్రోల్ వ్యవస్థ రైళ్ల కదలికలను అనుక్షణం కళ్లతో పరిశీలిస్తుంది. నిర్ణీత వేగం దాటి రైలు ప్రయాణించకుండా హెచ్చరిస్తుంది.


### ప్రమాదాల నివారణ వ్యవస్థ


ఒకవేళ బుల్లెట్ రైళ్లు పట్టాలు తప్పితే ప్రమాదం జరగకుండా చూసే వ్యవస్థ ఉంటుంది. పట్టాలు తప్పిన బోగీలు పక్క రైల్వే ట్రాక్‌పై పడి ఆ పట్టాలపై వచ్చే ఢీకొట్టకుండా చూస్తుంది. బుల్లెట్ రైళ్లు అత్యంత భరోసా ఇస్తూ ప్రయాణిస్తాయి. పొరపాటున రైలు ప్రమాదాలు జరిగినప్పటికీ ప్రాణనష్టం కలగకుండా బుల్లెట్ ట్రైన్‌ను అయస్కాంత సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. రైలు ప్రారంభమైన స్టేషన్ నుంచి చివరి స్టేషన్‌కు మధ్య నిర్దేశించిన సమయం కంటే ఒక నిమిషం అటూ ఇటూగా చేరుకుంటుంది. దీంతో బుల్లెట్ రైళ్లు ఎక్కిన ప్రయాణికులు అనుకున్న సమయానికి అనుకున్న స్టేషన్‌కు చేరుకునే వీలు ఉంటుంది. ❑



ఈ వారం 'కార్టూన్స్'


మీ వంశంలో మొన్ననే కావచ్చు కానీ.. మా
తాత, ముత్తాతలు కోవిడ్-19 తోనే పోయారు తెల్సా..?!
Zakir...


ఈయన మాష్టో మనిషిని బండ బూతులు తిట్టాలి.. మీకేమో
సంబంధం లేకున్నా.. ఆవేశపడిపోయి.. ఈయన్ని చెప్పుతో కొట్టాలి..!!
TV
LIVE
డిబేట్
Zakir...


ఇందాక ఒక బూతు మాట మాట్లాడావు..!
నిన్ను పద్నాలుగు గంటలు బ్లాక్ చేస్తున్నా..!!

## ఫోటో ఫీచర్



రాజస్థాన్‌లోని ఈ కోటను గ్రేట్ వాల్ ఆఫ్ ఇండియా అంటారు. కుంభాల్‌గఢ్ కోటకు రక్షణగా పొడవైన ఈ గోడను నిర్మించారట అప్పటి రాజులు. ఆరావళి కొంత ప్రాంతంలో సుమారు ఏడు వందల ఎకరాలలో దీనిని నిర్మించారు. దీని పొడవునా హిందూ దేవాలయాలు, జైన మందిరాలు ఉన్నాయి. కుంభాల్‌గఢ్ కోట యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది.





